**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 300 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | సోమవారం 23 మార్చి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


# చేసే పని మంచిదైతే చరిత్రలో నిలుస్తుంది

**అందుకు హైదరాబాదే సాక్ష్యం**

**అమరావతి అంతకు మించిన రాజధాని అవుతుంది**

**బాగా పనిచేస్తే అంతా మీ దగ్గరకొస్తారు.. విఫలమైతే ఎవరూ రారు**

**జీవితంలో ఆ రెండూ చూశా**

**సవాళ్లను ఎదుర్కొనే ముందస్తు ప్రణాళిక అవసరం**

**ఐఎస్‌బీలో నిర్వహించిన సదస్సులో చంద్రబాబు వ్యాపార పాఠాలు**

**భవిష్యత్తులో హైదరాబాద్, అమరావతి అత్యుత్తమ నివాసయోగ్య నగరాలుగా ఉంటాయి. హైదరాబాద్ అభివృద్ధికి ఎంతో కృషి చేశా. అది మరింత ఎదగాలని కోరుకుంటాను. పురోగతికి ఎలాంటి ఇబ్బందీ రాకూడదు. అమరావతి కూడా హైదరాబాద్‌ను మించిన మెరుగైన నగరం అవుతుంది. రెండూ నంబర్ 1, నంబర్ 2లో ఉండాలి.**

**ముఖ్యమంత్రి చంద్రబాబు**



'మీరు బాగా పనిచేస్తుంటే భాగస్వాములంతా వారంతట వారే వస్తారు. విఫలమైతే ఎవరూ రారు. నా జీవితంలో ఈ రెండూ అనుభవించాను. 1999 వరకు అన్ని ఎన్నికల్లో విజయం సాధించాను. 1999-2004 వరకు అందరూ వచ్చి పొగుడుతుండేవారు. నేను బ్యాలెన్స్ కోల్పోయాను. 2004 ఎన్నికల్లో ఓడిపోయాను. ఎంతో అభివృద్ధి చేసిన ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానాన్ని కూడా కోల్పోయాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో ఆదివారం నిర్వహించిన ఈవో సౌత్ ఆసియా లెర్నింగ్ సమిట్‌లో భాగంగా ట్రాన్స్‌ఫార్మింగ్ ఏఐ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్డిల్యాబ్స్ ఛైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డితో నిర్వహించిన ముఖాముఖిలో చంద్రబాబు బిజినెస్ స్కూల్ విద్యార్థులకు తన రాజకీయ అనుభవాలు వివరిస్తూనే.. వ్యాపార పాఠాలు బోధించారు. యువ పారిశ్రామికవేత్తలు ప్రణాళికలతో అమరావతికి రావాలని, ఆహారశుద్ధి రంగంలో పారిశ్రామికవేత్తల అవసరం ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రపంచ ఐటీ కేంద్రంగా

- మిగతా 2లో



## హార్మూజ్ జలసంధిని శాశ్వతంగా మూసివేస్తాం..

**అమెరికాకు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్**

- ట్రంప్ హెచ్చరికలతో గల్ఫ్‌లో పెరిగిన ఉద్రిక్తత
- తమ విద్యుత్ కేంద్రాలను తాకితే అమెరికా బేస్‌లే లక్ష్యం అన్న ఇరాన్
- బ్యారెల్ ముడిచమురు ధర 119 డాలర్లకు చేరిక
- గడువు సమీపిస్తుండటంతో మిత్రదేశాలతో అమెరికా అత్యవసర చర్చలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలపై ఇరాన్ అత్యంత కఠినంగా స్పందించింది. తమ దేశంలోని విద్యుత్ కేంద్రాలపై

- మిగతా 2లో



## ప్రతి నీటి బొట్టునూ సంరక్షించుకుందాం

**రాష్ట్రంలో పెద్దఎత్తున తాగునీటి ప్రాజెక్టుల పనులు**

**ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్**

ప్రతి నీటి బొట్టునూ సంరక్షించుకుని భవిష్యత్తును కాపాడుకుందామని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. నీటి ప్రాముఖ్యతను గుర్తించి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. నీటి ప్రాధాన్యాన్ని తెలియజెబుతూ జలజీవన్ మిషన్, ఉపాధి హామీ పథకాల కింద రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న జల సంరక్షణ కార్యక్రమాలు, తాగునీటి ప్రాజెక్టుల పనులను వివరించారు. 'గత 20 నెలల్లో ఒక టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం గల 1,06,788 వ్యవసాయ కుంటలు, 13,500 పశువుల తొట్టెలను నిర్మించాం. 1.46 కోట్ల జనాభాకు లబ్ధి చేకూరేలా రూ.9,441 కోట్లతో 8 మల్టీ విలేజ్ నీటి పథకాల పనులు చేపట్టాం. రూ.9,355 కోట్లతో త్వరలో మరో ఏడు మల్టీ విలేజ్ పథకాల పనులు ప్రారంభం కానున్నాయి. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న మరో 3 వేల గ్రామాల్లో 38.54 లక్షల జనాభాకు లబ్ధి చేకూరేలా రూ.1,814.71 కోట్లతో పనులు చేపట్టనున్నాం' అని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు.



## ఏపీలో రాబోయే నాలుగు రోజులు వర్షాలు!

- పిడుగులు, బలమైన ఈదురు గాలులతో కూడిన వానలు
- వర్షాలు పడినా 2-3 డిగ్రీలు పెరగనున్న ఉష్ణోగ్రతలు
- రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

వేసవి తాపంతో అల్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వాతావరణ శాఖ ఒకేసారి తీపి, చేదు కబుర్లు అందించింది. రాష్ట్రంలో రాబోయే నాలుగు రోజుల పాటు పిడుగులతో కూడిన వర్షాలు

- మిగతా 2లో

## మెరిసిన ఎర్ర బంగారం

**మిర్చికి క్వింటాలుకు సగటున రూ.20 వేలు**

మిరప రైతు ఐదేళ్లుగా కుంగిపోయాడు. 90% మంది అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఇక సాగు చేయలేమంటూ కొందరు వైదొలిగారు. మరికొందరు సాగు తగ్గించుకున్నారు. ఈ ఏడాదీ ధర లేకుంటే కాడి కింద పడేయాల్సిన దుస్థితి. ఈ సమయంలో జనవరి నుంచి మిరప ధరల పెరుగుదల మొదలైంది. క్వింటాలుకు సగటున రూ.20 వేల వరకు దక్కుతోంది. జనవరి నాటి ధరతో పోలిస్తే సగటున క్వింటాలుకు రూ.5వేలకు పైగానే పెరిగింది.

- మిగతా 2లో





## తల్లీబిడ్డా క్షేమం...హెల్త్ ఇండెక్స్ లో దేశం కంటే మనమే బెటర్

- లక్ష ప్రసవాలకు మాతృ మరణాలు 43 మాత్రమే.. జాతీయ సగటు 88
- శిశు మరణాల రేటు 21 నుంచి 18కి డౌన్
- 99.9 శాతం ప్రసవాలు హాస్పిటల్స్?లోనే..
- సోషియో ఎకనామిక్ సర్వే 2026 రిపోర్టులో వెల్లడి

గర్భిణులు, పసిబిడ్డల ప్రాణాలు కాపాడటంలో రాష్ట్రం దేశానికే దిక్సూచిగా నిలుస్తున్నది. ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తెలంగాణ సోషియో ఎకనామిక్ సర్వే-2026 రిపోర్టు ప్రకారం.. అన్ని కీలక ఆరోగ్య సూచికల్లో తెలంగాణ జాతీయ సగటును మించి దూసుకుపోతున్నది. క్షేత్రస్థాయిలో పెరిగిన మౌలిక సదుపాయాలు, నిరంతర పర్యవేక్షణ కారణంగా రాష్ట్రంలో మాతృ, శిశు ఆరోగ్యం

- మిగతా 2లో

## ఏపీఐఐసీ అధీనంలోని 51 వేల ఎకరాల మ్యుటేషన్‌కు అనుమతి

- 22ఏ నిషేధిత జాబితా నుంచి ఏపీఐఐసీ భూములను తొలగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు
- 51,603 ఎకరాల భూమిని ఏపీఐఐసీ పేరున మ్యుటేషన్ చేసేందుకు గ్రీన్ సిగ్నల్
- పారిశ్రామిక అభివృద్ధికి, పెట్టుబడులకు అడ్డంకులు తొలగించడమే లక్ష్యం
- ఈ మేరకు పరిశ్రమల శాఖ జీవో నెం. 61 విడుదల




రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి ఊతమిచ్చే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ)కి చెందిన భూములను రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్ జీవో నెం. 61ని విడుదల చేశారు.ఈ ఉత్తర్వుల ప్రకారం, 51,603.46 ఎకరాల భూమిని ఏపీఐఐసీ పేరు మీద రెవెన్యూ రికార్డుల్లో మ్యుటేషన్ చేసేందుకు ప్రభుత్వం అధికారం ఇచ్చింది. వీటిలో 32,723 ఎకరాల ప్రభుత్వ భూములు,

- మిగతా 2లో

## హార్మూజ్‌పై అల్టిమేటం

- 48 గంటల్లోగా తెరవాలి
- లేకపోతే ఇరాన్ విద్యుత్కేంద్రాలను ధ్వంసం చేస్తాం
- ట్రంప్ హెచ్చరిక
- అలాచేస్తే హార్మూజ్‌ను పూర్తిగా మూసేస్తామన్న ఐఆర్‌జీసీ
- ఇజ్రాయెల్‌పై క్షిపణులతో విరుచుకుపడిన ఇరాన్
- డిమోనా, అరాద్ నగరాల్లో దాదాపు 200 మందికి గాయాలు



కైరో: పశ్చిమాసియాలో యుద్ధం రోజురోజుకూ మరింత తీవ్రస్థాయికి చేరుతోంది. తమ నతాంజ్ అణు శుద్ధి కేంద్రంపై వైమానిక దాడులకు ప్రతీకారంగా ఇజ్రాయెల్‌పై ఇరాన్ తాజాగా విరుచుకుపడింది. దక్షిణ ఇజ్రాయెల్‌లోని డిమోనా, అరాద్ నగరాలపై అది జరిపిన దాడుల్లో దాదాపు 200 మంది గాయపడ్డారు. డిమోనాకు సుమారు 10 కిలోమీటర్ల దూరంలోని ఇజ్రాయెల్ అణు పరిశోధన కేంద్రాన్ని ఇరాన్ లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు- హార్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తిరిగి తెరవాలంటూ టెహ్రాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్టిమేటం జారీ చేశారు. లేనిపక్షంలో

- మిగతా 2లో

# చేసే పని మంచిదైతే చరిత్రలో నిలుస్తుంది

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్‌ను తీర్చిదిద్దడంలో చంద్రబాబు విజన్‌పై ప్రదర్శించిన ప్రత్యేక వీడియో ఆకట్టుకుంది. హైదరాబాద్ అభివృద్ధికి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా తాను చేసిన కృషిని వివరించారు. బిల్‌గేట్స్‌తో సమావేశమై నిరంతర సంప్రదింపుల ద్వారా మైక్రోసాఫ్ట్‌ను హైదరాబాద్‌కు తీసుకొచ్చామని, హైదరాబాద్ అభివృద్ధి తెలుసుకుని అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్, బ్రిటన్ ప్రధాని టోనీ బ్లేయర్ వచ్చారని చంద్రబాబు వివరించారు. 'జినోమ్ వ్యాలీ ఏర్పాటుకు వెయ్యి ఎకరాలిచ్చాం. అక్కడ భారత్ బయోటెక్ సంస్థ తయారు చేసిన కొవిడ్ టీకా మన ప్రాణాలు కాపాడింది. ప్రధాని మోదీ కూడా 100 దేశాలకు టీకా ఉచితంగా పంపిణీ చేశారు' అని చెప్పారు. సమిట్‌లో చంద్రబాబు చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు..

2019 ఎన్నికల్లో ఓడిపోకుండా ఉంటే ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి వేగం కొనసాగేది. ఓటమి ఆ వేగాన్ని అడ్డుకుంది. వ్యాపారం చేస్తున్నప్పుడు అన్నీ బాగున్నాయనే అనుకుంటాం. అంతా సవ్యంగా సాగేప్పుడే జాగ్రత్తగా ఉండాలి. మనం చేస్తున్న పని, వ్యాపారం ఎంత వరకు స్థిరంగా కొనసాగుతుందనేది ఆలోచించాలి.

వ్యాపారాన్ని ప్రభావితం చేసే అంశాలు రెండు.. ఒకటి అంతర్గత, రెండు బాహ్యాపరమైనవి. ఇందులో సవాళ్లను ఎదుర్కొనే ముందస్తు ప్రణాళిక ఉండాలి. లేదంటే సమస్యల్లో పడతారు. వ్యాపారమైనా, రాజకీయమైనా మనం పొరపాట్లు చేయకూడదు. నా జీవితంలో నేను నేర్చుకున్నది ఇదే.

2024లో కూటమికి స్పష్టమైన ఆధిక్యం ఇచ్చారు. 94% సీట్లతో అఖండ విజయం కట్టబెట్టారు. 20 నెలలుగా బాగా పనిచేస్తున్నాం. దేశంలోనే అధిక పెట్టుబడులు సాధిస్తున్నాం.

**వ్యాపారంలో డబ్బు కంటే సాఫ్ట్ స్కిల్స్ ముఖ్యం**

మెకెన్సీతో కలిసి ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ఏర్పాటు చేయాలని ఫార్చ్యూన్ 500 సంస్థలు నిర్ణయించాయి. వారిని సంప్రదిస్తే.. ముంబయి, బెంగళూరు, చెన్నై పరిశీలిస్తున్నట్లు చెప్పారు. నాలుగో ప్రాధాన్యంగా హైదరాబాద్ వచ్చి కాఫీ తాగి వెళ్లమని కోరాను. వారు హైదరాబాద్ రాగానే.. ఐదుగురు మంత్రుల్ని ఏసీ బస్సుతో పంపాను. బొకేలు, శాలువాలతో ఘనంగా గౌరవించాం. స్వయంగా నేనే అల్పాహారం వడ్డించి ప్రజంటేషన్ ఇచ్చాను. ఇతర రాష్ట్రాలు ఇచ్చే దాని కంటే ఎక్కువ ప్రోత్సాహకాలిస్తామని హామీ ఇచ్చా. తర్వాత వారు ముంబయి వెళ్తే సీట్లలో రిజర్వేషన్ ఇవ్వాలని అక్కడి పాలకులు కోరారు. బెంగళూరు వెళ్తే 3 గంటలు నిరీక్షించాల్సి వచ్చింది. చెన్నై వెళితే సరైన గౌరవం దక్కలేదు. తర్వాత వారు నాకు ఫోన్ చేసి హైదరాబాద్ వస్తున్నామని, మిమ్మల్ని నమ్ముతున్నామని చెప్పారు. అలా ఐఎస్‌బీ సాకారమైంది. వ్యాపారంలో డబ్బు కంటే ఎదుటి వారిని ఎలా సంతృప్తి పరచాలనేదే ముఖ్యం. సాఫ్ట్ స్కిల్స్ ఎంతో అవసరం. ఐఎస్‌బీ ఏర్పాటు సమయంలో నేను చేసిందదే. ఆ మర్యాద చూసే వారు వచ్చారు. ఇప్పుడిది భారతదేశంలోని అత్యుత్తమ బిజినెస్ స్కూళ్లలో ఒకటిగా నిలవడం గర్వకారణం.

**రాజకీయం చేయకుండా.. అభివృద్ధి ఒక్కటే సరిపోదు..**

పదేళ్ల తర్వాత 2014లో అధికారంలోకి వచ్చాం. అప్పుడే రాష్ట్ర విభజన జరిగింది. ఐదేళ్లపాటు ఎంతో కష్టపడి పనిచేశా. అయినా 2019 ఎన్నికల్లో మరోసారి అధికారం కోల్పోయాం. రాజకీయం చేయకుండా.. అభివృద్ధి మాత్రమే చేసుకుంటూ పోతే ఎన్నికల్లో గెలవలేమని అర్థమైంది.

2019–24 మధ్య ఆంధ్రప్రదేశ్ సర్వస్వం కోల్పోయింది. రాష్ట్రం పూర్తిగా నాశనమైంది. బ్రాండ్ తుడిచిపెట్టుకుపోయింది. రాజధాని నిర్మాణానికి 33 వేల ఎకరాలు ఇస్తే ధ్వంసం చేశారు. ఎడారిగా మార్చారు. శ్మశానం అని నిందలేశారు. మేము వచ్చాక మళ్లీ రూ.60 వేల కోట్లతో పనులు జరుగుతున్నాయి. హైదరాబాద్ కంటే మెరుగైన నగరంగా అమరావతి తయారవుతుంది. అమెరికాలో సిలికాన్ వ్యాలీ గురించి తెలుసు.. రేపు అమరావతి క్వాంటం వ్యాలీ గురించి అంతా వింటారు.

నీలి, హరిత, హరిత ఇంధన రాజధానిగా అమరావతిని నిర్మిస్తున్నాం. అక్కడ నిర్మించే వారి జీవనకాలం 20 ఏళ్లు పెరుగుతుంది. స్మార్ట్ సిటీగా రూపొందుతుంది. 5, 10, 15 నిమిషాల్లోనే పార్కు, ఆసుపత్రులు, ఇతర నిత్యావసర పనులకు చేరుకోవచ్చు.

అమరావతికి వచ్చేందుకు డీఎల్‌ఎఫ్ సిద్ధంగా ఉంది. గతంలో హైదరాబాద్ రమ్మంటే రాలేదని సంస్థ ప్రతినిధి బాధపడ్డారు. ఈ దఫా 100% అమరావతికి వస్తామన్నారు. సతీష్‌రెడ్డి, ఛైర్మన్, రెడ్డి ల్యాబ్స్: మీ రాజకీయ ప్రయాణం చాలా భిన్నం. ఎంతో అభివృద్ధి చేసినా 2004 ఎన్నికల్లో ఓడిపోయారు. 2014లో రాష్ట్ర విభజన జరిగింది. గొప్ప విజన్‌తో అమరావతి నిర్మాణం చేపట్టారు. తర్వాత వచ్చిన ప్రభుత్వం ఆ అమరావతి లక్ష్యాన్ని ధ్వంసం చేసింది. గొప్ప పనులు చేశాక కూడా ప్రతికూలత ఎదురైతే ఆలోచనా విధానం ఎలా ఉంటుంది? ఇప్పుడు మళ్లీ అధికారంలో ఉన్నారు. విజన్‌పై దృష్టి పెడుతున్నారు. మళ్లీ ఓడిపోతామనే ఆందోళన ఉందా?

చంద్రబాబు: ఎలాంటి భయమూ లేదు. మనం చేసే పని మంచిదైతే అది చరిత్రలో నిలిచిపోతుంది. నిన్న చేసింది నేడు చరిత్రగా మారుతుంది. హైదరాబాద్‌లో ఫార్మా, బయో, ఐటీ, ఫైనాన్స్, ఎయిర్‌పోర్టు, మౌలిక సౌకర్యాలు అన్నీ నేను చేసినవే. విభజన తర్వాత అధిక తలసరి ఆదాయం కలిగిన రాష్ట్రంగా తెలంగాణ, ఉత్తమ నివాసయోగ్య నగరంగా హైదరాబాద్ ఉన్నాయి. తెలంగాణలో నేను అధికారంలో లేకపోయినా చేసిన పని గుర్తుండి పోతుంది. 1995–99 మధ్య పూర్తి జాగ్రత్తలు తీసుకున్నాం. 2004 వరకు తెదేపా మద్దతుతో కేంద్రంలో ఎన్డీయే అధికారంలో ఉంది. ఎన్నో చేశాం. అన్నిటిపైనా ప్రతిపక్షం దుష్ప్రచారం చేసింది.

ఏపీలో 2014–19 మధ్య కేవలం అభివృద్ధిపైనే దృష్టి పెట్టాం. ఓటమి పాలయ్యాం. ఇప్పుడు చాలా జాగ్రత్తగా ఉంటాను. ప్రజల్ని సంతోషపరచడం ఎంతో ముఖ్యం. స్వల్ప, మధ్యస్థ, దీర్ఘకాలిక ప్రణాళికలు తప్పనిసరి. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన మూడూ కలిసి సాగాలి. ఒకదాన్ని మాత్రమే చేస్తే బ్యాలెన్స్ తప్పుతుంది.

# హార్ముజ్‌పై అల్టిమేటం

-మొదటిపేజీ తరువాయి

ఇరాన్‌లోని విద్యుత్కేంద్రాలను తుడిచిపెట్టేస్తామని హెచ్చరించారు. ఆయన హెచ్చరికపై టెహ్రాన్ దీటుగా స్పందించింది. తమ విద్యుత్కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటే.. పశ్చిమాసియా వ్యాప్తంగా కీలక మౌలిక సదుపాయాలు, ఇంధన వసతులను ధ్వంసం చేస్తామని బదులిచ్చింది. హార్మూజ్‌ను పూర్తిగా మూసివేస్తామనీ హెచ్చరించింది.నతాంజ్‌పై దాడికి ప్రతిగా.. ఇజ్రాయెల్ అణ్వాయుధ కార్యక్రమంలో అత్యంత కీలకమైన ది షిమోన్ పెరెస్ నెగెవ్ అణు పరిశోధన కేంద్రాన్ని ఇరాన్ శనివారం రాత్రి లక్ష్యంగా చేసుకుంది. దానిపైకి క్షిపణులను ప్రయోగించింది. టెహ్రాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణుల్లో రెండింటిని ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకోలేకపోయాయి. వందల కిలోల పేలుడు పదార్థాలతో దూసుకొచ్చిన ఈ క్షిపణుల్లో ఒకటి డిమోనాలో, మరొకటి అరాద్‌లో పడ్డాయి. దీంతో పలు భవనాలు ధ్వంసమయ్యాయి. రెండు నగరాల్లో కలిపి దాదాపు 200 మంది గాయపడ్డారు. వారిలో ఇద్దరు చిన్నారులు సహా 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులను తమ గగనతల రక్షణ వ్యవస్థలు గుర్తించినప్పటికీ.. వాటిని అడ్డుకోలేకపోవడంపై దర్యాప్తు జరుపుతున్నట్లు ఇజ్రాయెల్ అధికారులు వెల్లడించారు. తాజా దాడుల్లో అణు పరిశోధన కేంద్రం దెబ్బతినలేదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) కూడా 'ఎక్స్'లో ఇదే విషయాన్ని పేర్కొంది. డిమోనాను 'లిటిల్ ఇండియా'గా పిలుస్తారు. ఇక్కడ భారత సంతతి ప్రజలు దాదాపు 7,500 మంది నివసిస్తున్నారు. వీరిలో అత్యధికులు మహారాష్ట్ర, కేరళ, పశ్చిమ బెంగాల్‌ల నుంచి వచ్చి స్థిరపడ్డవారే. డిమోనా, అరాద్‌లపై దాడుల తర్వాత ఇరాన్ సైనికాధికారులు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ గగనతలానికి ప్రస్తుతం రక్షణ లేదన్నారు. ఇకపై తాము చేసే దాడులు వాషింగ్టన్, టెల్‌అవీవ్‌లను ఆశ్చర్యపరుస్తాయని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ఆక్రమిత ప్రాంతాల గగనతలంలో తమ క్షిపణులు ఆధిపత్యం ప్రదర్శిస్తున్నాయని ఇరాన్ ఐఆర్‌జీసీ ఏరోస్పేస్ ఫోర్స్ అధిపతి మేజర్ జనరల్ సయ్యద్ మజీద్ మూసావి అన్నారు. సెంట్రల్ ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్లస్టర్ బాంబులతో ఆదివారం దాడులు చేసింది. టెల్ అవీవ్‌తో పాటు దాని సమీప నగరాల్లో ఈ పేలుడు పదార్థాల కారణంగా 36 మంది గాయపడ్డారు. వారిలో 19 మంది చిన్నారులే.

**హార్మూజ్‌ను తెరవకపోతే..: ట్రంప్**

హార్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తిరిగి తెరవాలని ఇరాన్‌కు ట్రంప్ శనివారం రాత్రి అల్టిమేటం జారీ చేశారు. లేకపోతే ఆ దేశంలోని విద్యుత్ కేంద్రాలను నాశనం చేస్తామని, అతిపెద్ద విద్యుత్కేంద్రంపై దాడితో ఆ పనిని మొదలుపెడతామని 'ట్రూత్ సోషల్' వేదికగా హెచ్చరించారు. ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) స్పందించింది. తమ విద్యుత్కేంద్రాలపై అమెరికా దాడి చేస్తే.. హార్మూజ్‌ను పూర్తిగా మూసివేస్తామని పేర్కొంది. కట్టుదిట్టమైన భద్రత ఉండే డిమోనా వంటి ప్రాంతంలోనూ తమ క్షిపణులను ఇజ్రాయెల్ అడ్డుకోలేకపోవడం యుద్ధంలో కొత్త దశకు సంకేతమని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బాఘర్ ఘలిబాఫ్ వ్యాఖ్యానించారు. అమెరికా తమ విద్యుత్కేంద్రాలపై దాడులకు దిగితే.. పశ్చిమాసియా వ్యాప్తంగా ఇంధన మౌలిక వసతులను నాశనం చేస్తామని హెచ్చరించారు.

**'ఎఫ్–15'ను కూల్చేశామన్న టెహ్రాన్**

హార్మూజ్ సమీపంలో శత్రువులకు చెందిన ఎఫ్–15 యుద్ధవిమానాన్ని కూల్చివేశామని ఇరాన్ తెలిపింది. ఎఫ్–15ను తమ గగనతల రక్షణ వ్యవస్థ విజయవంతంగా లాకింగ్ చేస్తున్నట్లున్న వీడియో ఒకటి ఇరాన్ మీడియాలో విడులైంది. అమెరికాతో పాటు సౌదీ అరేబియా, ఇజ్రాయెల్, ఖతార్ వంటి పశ్చిమాసియా దేశాల వద్ద ఎఫ్–15లు ఉన్నాయి.

**ఇరాన్‌తో ముప్పు: నెతన్యాహు**

ఇరాన్ నుంచి యావత్ ప్రపంచ భద్రతకు ముప్పు పొంచి ఉందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు అన్నారు. అందుకే అందరి తరఫున.. అమెరికా, తాము కలిసి ఆ దేశంపై పోరాడుతున్నామని పేర్కొన్నారు. అరాద్‌లో క్షిపణి దాడి జరిగిన ప్రాంతాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. ఐరోపాపైనా దాడి చేయగల సామర్థ్యం ఇరాన్‌కు ఉందని చెప్పేందుకు డిగో గార్సియాపై అది చేసిన దాడే నిదర్శనమని చెప్పారు. మరోవైపు– నతాంజ్ అణుకేంద్రంపై దాడితో తమకు సంబంధం లేదని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది.

ఉత్తర ఇజ్రాయెల్‌లోని కిబుట్జ్ ప్రాంతంపై ఆదివారం రాకెట్ దాడిలో ఓ వ్యక్తి మృత్యువాతపడ్డాడు. ప్రస్తుత యుద్ధం మొదలయ్యాక హెజ్‌బొల్లా దాడితో ఇజ్రాయెల్‌లో నమోదైన తొలి మరణం ఇదే.

దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైన్యం చేసిన దాడిలో నలుగురు హెజ్‌బొల్లా ముష్కరులు హతమయ్యారు.

సౌదీ అరేబియా రాజధాని రియాధ్‌వైపు ఆదివారం మూడు బాలిస్టిక్ క్షిపణులు దూసుకొచ్చాయి. వాటిలో ఒకదాన్ని సౌదీ గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయి. మిగిలిన రెండు జనావాసాల్లేని ప్రాంతాల్లో పడ్డాయి. తూర్పు సౌదీలో ఆరు డ్రోన్లను కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు. తమ దేశంపై ఇరాన్ చేస్తున్న వరుస దాడులకు నిరసనగా రియాధ్‌లోని ఇరాన్ దౌత్యాధికారుల్ని సౌదీ అరేబియా బహిష్కరించింది. .

**హార్మూజ్‌కు బ్రిటన్ అణు జలాంతర్గామి**

బ్రిటన్‌కు చెందిన అణు జలాంతర్గామి 'హెచ్‌ఎంఎస్ ఆన్సన్' హార్మూజ్ జలసంధి సమీపానికి చేరుకుందని, దాన్ని ప్రస్తుతం ఉత్తర అరేబియా సముద్రంలో మోహరించారని బ్రిటిష్ మీడియాలో తాజాగా కథనాలు వెలువడ్డాయి. ఈ జలాంతర్గామిలో తోమహాక్ క్షిపణులు, భారీ టోర్పిడోలు, శక్తిమంతమైన ఆయుధ సంపత్తి ఉన్నట్లు సమాచారం.

**ఖతార్ హెలికాప్టర్ కూలి.. ఆరుగురి మృత్యువాత**

ఖతార్‌కు చెందిన ఓ హెలికాప్టర్ సాంకేతిక లోపం కారణంగా పర్షియన్ గల్ఫ్‌లో శనివారం కూలిపోయింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు మృత్యువాతపడ్డారు. వారిలో ముగ్గురు ఖతార్ భద్రతా బలగాల సిబ్బంది, ముగ్గురు తుర్కియే జాతీయులు ఉన్నారు.

# తల్లీబిడ్డా క్షేమం...హెల్త్ ఇండెక్స్ లో దేశం కంటే మనమే బెటర్

-మొదటిపేజీ తరువాయి

మరింత మెరుగైంది. ఫలితంగా మరణాల రేటు గణనీయంగా తగ్గినట్లు రిపోర్టు పేర్కొన్నది.

**దేశ సగటు కంటే అన్నింట్లోనూ బెటర్**

జాతీయ ఆరోగ్య గణాంకాలతో పోలిస్తే రాష్ట్ర పరిస్థితి చాలా మెరుగ్గా ఉన్నట్లు రిపోర్టు స్పష్టం చేస్తోంది. దేశంలో ప్రతి లక్ష ప్రసవాలకు మాతృ మరణాల సంఖ్య 88గా ఉంటే.. అదే మన రాష్ట్రంలో ఆ సంఖ్య కేవలం 43 మాత్రమే. అంటే దేశ సగటు కంటే మన దగ్గర మరణాలు సగం కంటే తక్కువగా నమోదవుతున్నాయి. దేశవ్యాప్తంగా ప్రతి వెయ్యి జననాలకు 25 మంది శిశువులు మరణిస్తుంటే, మన రాష్ట్రంలో ఆ సంఖ్య 18కే పరిమితమైంది.

అలాగే, ఐదేళ్లలోపు పిల్లల మరణాల రేటులో జాతీయ సగటు 29 ఉండగా, తెలంగాణలో అది 22 మాత్రమే. నవజాత శిశు మరణాలు రేటులో దేశ సగటు 19గా ఉండగా మన రాష్ట్రం 14కు తగ్గించగలిగింది.

**ఒక్క ఏడాదిలో మార్పు**

2025 లెక్కలతో పోలిస్తే.. 2026లో రాష్ట్రంలో అన్ని ఆరోగ్య సూచికల్లో సానుకూల మార్పులు వచ్చాయి. శిశు మరణాలు 2025 సర్వేలో 21 ఉండగా, 2026 నాటికి 18కి తగ్గింది. నవజాత శిశు మరణాలు 15 నుంచి 14కు, ఐదేళ్లలోపు మరణాలు 23 నుంచి 22కు తగ్గింది. ఇనిస్టిట్యూషనల్ (ఆస్పత్రి) డెలివరీలు 2025లో 97 శాతంగా ఉండగా, 2026 నాటికి అది ఏకంగా 99.9 శాతానికి చేరుకుంది.

**అంతా దవాఖానల్లోనే..**

ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ఇండ్ల వద్దే ప్రసవాలు జరిగి తల్లీబిడ్డల ప్రాణాలు ప్రమాదంలో పడేవి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారుతున్నది. 99.9 శాతం ప్రసవాలు హాస్పిటల్స్?లోనే జరుగుతున్నట్లు రిపోర్టు స్పష్టం చేసింది. గవర్నమెంట్?లో 50 శాతం, ప్రైవేట్ లో 49.9 శాతం ప్రసవాలు జరుగుతున్నాయి.

గర్భిణులు మొదటి మూడు నెలల్లోనే 97.5 శాతం మంది పేర్లు నమోదు చేసుకోవడం, కనీసం 94 శాతం మంది నాలుగు సార్లు వైద్య పరీక్షలు చేయించుకోవడంతో మరణాలను అరికట్టడం సాధ్యమైందని రిపోర్టు పేర్కొన్నది.

విజన్ 2047 లక్ష్యంగా..

రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ –విజన్ 2047లో భాగంగా మాతృ మరణాలను 6 కంటే తక్కువకు, శిశు మరణాలను 7 కంటే తక్కువకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీని కోసం ఆరోగ్య రంగంపై పెట్టే ఖర్చును రాష్ట్ర జీఎస్డీపీలో ప్రస్తుతమున్న దానికంటే 8 శాతానికి పెంచాలని నిర్ణయించింది. అలాగే మాతృ, శిశు మరణాల తగ్గింపునకు చర్యలు తీసుకోవడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమైనట్లు రిపోర్టు పేర్కొన్నది.

అమ్మఒడి 102 సర్వీస్ ద్వారా 300 ప్రత్యేక వాహనాల ద్వారా 7.90 లక్షల మంది గర్భిణులకు ఉచిత రవాణా అందిస్తున్నట్లు, మహిళల ఆరోగ్య సమస్యల కోసం 372 సెంటర్లలో స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించినట్లు పేర్కొన్నది. టీ–డయా గ్నోస్టిక్స్ పేరుతో 31 జిల్లా హబ్ ల ద్వారా ఉచితంగా వైద్య పరీక్షలు అందుబాటులోకి తెచ్చినట్లు రిపోర్టు స్పష్టం చేసింది.

## హార్మూజ్ జలసంధిని శాశ్వతంగా మూసివేస్తాం..

-మొదటిపేజీ తరువాయి

దాడి చేయాలని చూస్తే, గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ప్రతిదాడి చేస్తామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ సంచలన ప్రకటన చేసింది. కేవలం సైనిక స్థావరాలే కాకుండా, ఆయా ప్రాంతాల్లోని అమెరికా అనుబంధ ఐటీ వ్యవస్థలు, తాగునీటి శుద్ధి కేంద్రాలను కూడా ధ్వంసం చేస్తామని తీవ్రంగా హెచ్చరించింది.

ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హార్మూజ్ జలసంధిని వచ్చే 48 గంటల్లోగా తెరవకపోతే ఇరాన్ పవర్ ప్లాంట్లను నామరూపాల్లేకుండా చేస్తామని ట్రంప్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలతో గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ జ్వాలలు రాజుకున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాకర్ ఖాలిబాఫ్ ఘాటుగా స్పందించారు. తమ మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటే ఈ ప్రాంతంలోని కీలక వ్యవస్థలన్నీ కోలుకోలేని విధంగా దెబ్బతింటాయని హెచ్చరించారు. అంతేకాకుండా, తమ విద్యుత్ కేంద్రాలను పునర్నిర్మించే వరకు హార్మూజ్ జలసంధిని శాశ్వతంగా మూసివేస్తామని, ఒక్క చమురు ట్యాంకర్‌ను కూడా ముందుకు కదలనివ్వబోమని ఇరాన్ సైన్యం స్పష్టం చేసింది.ఈ సంక్షోభం ప్రభావం అంతర్జాతీయ మార్కెట్లపై తీవ్రంగా పడింది. గత ఫిబ్రవరి 28 నుంచి జలసంధి మూతపడటంతో ఇంధన సరఫరా నిలిచిపోయి, బ్యారెల్ ముడిచమురు ధర ఇప్పటికే 119 డాలర్ల గరిష్ఠ స్థాయికి చేరుకుంది. మరోవైపు, ఇరాన్ ఇజ్రాయెల్‌పై క్షిపణులు ప్రయోగిస్తుండగా, లెబనాన్ నుంచి హెజ్బొల్లా దాడులతో మధ్యప్రాచ్యంలో యుద్ధ వాతావరణం మరింత ముదురుతోంది.తాజా సమాచారం ప్రకారం ట్రంప్ విధించిన గడువు సమీపిస్తుండటంతో వైట్ హౌస్ అధికారులు మిత్రదేశాలతో అత్యవసర చర్చలు జరుపుతున్నారు. ఇరాన్ తీరానికి సమీపంలో అమెరికా బాంబర్ విమానాలు గస్తీని ముమ్మరం చేశాయి. దీంతో గల్ఫ్ ప్రాంతంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

## ఏపీలో రాబోయే నాలుగు రోజులు వర్షాలు!

-మొదటిపేజీ తరువాయి

కురుస్తాయని, అదే సమయంలో ఉష్ణోగ్రతలు కూడా పెరిగే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉపరితల ఆవర్తనం, ద్రోణి కారణంగా ఈ వాతావరణ మార్పులు చోటుచేసుకుంటున్నాయని అధికారులు తెలిపారు. వర్షంతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీస్తాయని అంచనా వేశారు.రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకారం.. సోమవారం ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడవచ్చు. అలాగే పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోనూ వర్షాలకు ఆస్కారం ఉంది. ఆదివారం పోలవరం, ఏలూరు, విశాఖపట్నం సహా కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో వాతావరణం కాస్త చల్లబడింది.అయితే వర్షాలు కురిసినప్పటికీ, రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు మరో 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. ముఖ్యంగా కోస్తా తీర ప్రాంతాల్లో గాలిలో తేమ శాతం పెరిగి ఉక్కపోత మరింత అధికమవుతుందని తెలిపారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున రైతులు, పశువుల కాపరులు చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. మధ్యాహ్నం వేళల్లో బయటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

## మెరిసిన ఎర్ర బంగారం

-మొదటిపేజీ తరువాయి

డిమాండ్ నేపథ్యంలో వ్యాపారులు గ్రామాలకు వెళ్లి అక్కడే రైతుల నుంచి నేరుగా కొంటున్నారు. నాలుగైదేళ్లుగా నష్టాలు చవిచూసిన మిరప రైతుకు ఈ ఏడాది మార్కెట్ కాస్త ఊరటనిచ్చింది. శీతల గోదాముల్లోని సరకు క్రమంగా తగ్గుతోంది. గుంటూరు మార్కెట్ యార్డుకు గత మంగళవారం 1.29 లక్షల బస్తాల మిర్చి రాగా, 1.26 లక్షలు బస్తాలు అమ్ముడుపోయాయి.

**సన్నరకాలకూ డిమాండే**

ఈ ఏడాది ఏపీలోనే కాదు, తెలంగాణ, కర్ణాటక, గుజరాత్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోనూ మిరప సాగు తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో జనవరి నుంచి ధరల్లో పెరుగుదల మొదలైంది. గతేడాది రూ.10 వేల లోపు అమ్మిన మిర్చి రకాలకు నేడు రూ.20 వేలకు పైగా దక్కుతోంది. జనవరిలో అన్నిరకాలకు ధరలు పెరిగినా, సన్నరకాలకు అంతగా డిమాండ్ లేదు. అయితే, ఈ రకం నిల్వలు తగ్గిపోవడంతో ప్రస్తుతం వ్యాపారులు కొనేందుకు పోటీ పడుతున్నారు. జనవరి, ఫిబ్రవరిలో రూ.15 వేలు ఉన్న తేజ ధర ప్రస్తుతం రూ.19,500కు చేరింది. తాలు ధరలు క్వింటాలుకు రూ.10 వేలకు పైనే ఉన్నాయి. ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు మిరప కోసిన వెంటనే ఆరబెట్టి అమ్మేస్తున్నారు. శీతల గోదాముల్లో 40 లక్షల బస్తాలు నిల్వలు ఉండగా, వాటిలో పాత మిర్చి 10 లక్షల వరకు ఉండొచ్చని అంచనా. రాష్ట్రవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లో 5 లక్షల బస్తాలున్నాయి. ధరలు అనుకూలించడంతో ఏసీలకు ఆశించిన మేర సరకు రాకపోవచ్చని శీతల గోదాముల యజమానుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సురేంద్రబాబు తెలిపారు. వాస్తవానికి గతంతో పోలిస్తే మిరప సాగుకు పెట్టుబడులు భారీగా పెరిగాయి. అన్ని ఖర్చులూ కలిపి ఎకరాకు రూ.4 లక్షల వ్యయమవుతోంది. ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి వస్తే సగటున క్వింటాలుకు రూ.18 వేల ధర లభిస్తే.. రూ.4.50 లక్షల వరకు చేతికొస్తోంది. గతేడాది అధిక శాతం రకాల మిరప ధరలు క్వింటాలుకు రూ.9 వేల నుంచి రూ.10 వేల లోపే. ధర దక్కకపోవడంతో సన్నరకం మిరప సాగు, ఉత్పత్తి 50% తగ్గింది. నల్లతామర ఉద్ధృతి పెరగడంతో వారానికి మూణ్నాలుగు సార్లు పిచికారి చేయాల్సి వచ్చింది. జెమిని వైరస్ ప్రభావమూ పెరిగింది. పెట్టుబడులు భారీగా పెరిగాయి.

## ఏపీఐఐసీ అధీనంలోని 51 వేల ఎకరాల మ్యుటేషన్‌కు అనుమతి

-మొదటిపేజీ తరువాయి

12,099 ఎకరాల డీకేటీ భూములు, 6,780 ఎకరాల పట్టా భూములు ఉన్నాయి. అదే సమయంలో, ఎలాంటి అభ్యంతరాలు లేని సుమారు 70 వేల ఎకరాల ఏపీఐఐసీ భూములను 22ఏ జాబితా నుంచి తొలగించనున్నారు.ఏపీఐఐసీ కేటాయించిన భూములు 22ఏ జాబితాలో ఉండటంతో, పరిశ్రమలు ఏర్పాటు చేసే సంస్థలు బ్యాంకు రుణాల కోసం ఆస్తులను తనఖా పెట్టలేకపోతున్నాయి. దీంతో ప్రాజెక్టులు ఆలస్యమవుతున్నాయి. ఈ అడ్డంకిని తొలగించి, పెట్టుబడులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.ఈ ప్రక్రియను అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఏపీఐఐసీ నుంచి అభ్యర్థన రాగానే తహసీల్దార్లు 'వెబ్‌ల్యాండ్' పోర్టల్‌లో మ్యుటేషన్ పూర్తి చేయాలి. అనంతరం జిల్లా రిజిస్ట్రార్లు ఈ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తారు. ఈ మొత్తం ప్రక్రియను 15 రోజుల్లోగా ప్రత్యేక డ్రైవ్‌గా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

# స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి కొల్లు రవీంద్ర.





* వేదిక, గ్యాలరీల్లో ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు.
* రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చనున్న అర్సెలార్ మిట్టల్ నిప్పన్.

**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 22**: ప్రతిష్టాత్మక అర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన ఏర్పాట్లను రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేదిక పై ఏర్పాట్లు, గ్యాలరీలో సదుపాయాలను పరిశీలించి పలు సూచనలుంచేశారు. పనుల పురోగతిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, భద్రతా ఏర్పాట్ల పై వివరించారు. శంకుస్థాపనకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, స్పీకర్, ఎమ్మెల్యేలు, భారీ సంఖ్యలో ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో భద్రత పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. భారీగా జన సమీకరణ జరిగే నేపథ్యంలో ఏర్పాట్లను దగ్గరుండి పరిశీలించారు. కార్యక్రమంలో హోమ్ మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, సీఎం టూర్ కోఆర్డినేటర్ సత్యనారాయణ రాజు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ శౌర్యమన్ పటేల్, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.



# నేటి స్టీల్ ప్లాంట్ ప్రారంభోత్సవం కార్యమాన్ని విజయవంతం చేయాలి



**పరవాడ, పెన్ సత్తా, మార్చి 22:** మండలం లోని కూటమి నాయుకులు అందరూ జిల్లా లోని నక్కపల్లి లో నేడు జరగనున్న స్టీల్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చెయ్యాలని వియ్యపు చిన్నా (మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు) కోరారు.

నక్కపల్లిలో భారతదేశంలో అతిపెద్ద ఇంటిగ్రీటెడ్ స్టీల్ ప్లాంట్ ఆర్సలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ సంయుక్త ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో నవ్యాంధ్ర సృష్టి కర్త, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కోనేదల పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పి.వి.ఎన్ మాధవ్ పాల్గొంటున్నారు. పెందుర్తి నియోజకవర్గం శాసన సభ్యులు పంచకర్ల రమేష్ బాబు, పెందుర్తి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గండి బాబ్జి, బిజెపి పెందుర్తి ఇంచార్జి రాము నాయుడు పిలుపు మేరకు పరవాడ మండలంలో కూటమి నాయుకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు అందరూ తరలి రావాలని వియ్యపు చిన్నా (మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు )కోరుతున్నామన్నారు.

# నూకాంబిక అమ్మ వారి కొత్త అమావాస్య మహోత్సవాలు





పట్టు వస్త్రాలు సమర్పించిన రాష్ట్ర హోం మంత్రి అనిత

**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 22:**ఉత్తరాంధ్ర ఇలవేల్పు, రాష్ట్ర పండుగ గుర్తింపు పొందిన, నూకాంబిక అమ్మ వారి వార్షిక జాతర మహోత్సవాలు భాగంగా ఆదివారం రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెను శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఘనంగా సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. ఆమె వెంట జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, అర్బన్ పైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంటు కార్పొరేషను చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, హౌసింగ్ బోర్డ్ చైర్మన్ బత్తల తాతబాబు ఎ.పి.గవర కార్పొరేషను చైర్మన్ మళ్ల సురేంద్ర, టిడిపి రాష్ట్ర నిర్వహణ కార్యదర్శులు దాడి రత్నాకర్, బుద్ధ నాగ ఈశ్వరరావు వున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళశ్రీధర్ ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవి కుమార్ పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



# సీసీ రోడ్లు నిర్మాణ పనులు పరిశీలించిన దొడ్డి







**మునగపాక, పెన్ సత్తా, మార్చి 22**: మండలంలో శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ సహకారంతో నాగులాపల్లి, ఉమ్మలాడ మార్గంలో 25 లక్షలు రూపాయలతో సీసీ రోడ్లు నిర్మాణ పనులు పరిశీలించిన తెలుగుదేశం పార్టీ నాయకులు దొడ్డి శ్రీనివాసరావు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అభివృద్ధి కి అడ్రస్ సుందరపు విజయ్ కుమార్ అని అన్నారు. గ్రామం లోని గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన రోడ్లన్నింటినీ ఇప్పుడు వేయడం జరుగుతుందంటే అది ఎమ్మెల్యే సుందర్ విజయ కుమార్ గొప్పతనం అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం సెర వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అదే మాదిరిగా యలమంచిలి నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో సిసి రోడ్లు వేయడం జరుగుతున్నందుకు ఎమ్మెల్యే కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాం. ఈ కార్యక్రమంలో మొల్లేటి ఆనంద్, ఆడారి నూక నాయుడు, పోలమరశెట్టి నాగు, పలమరశెట్టి మురళి, మల్ల అప్పల నాయుడు, దొడ్డి ప్రకాష్, సన్నెల శీను, జువాల హరిప్రసాద్, అడపా నరేంద్ర, ముత్రాజ్ కాలనీ యువత అంతా పాల్గొన్నారు.

# భూ నిర్వాసితుల సమస్య లు పరిష్కారానికి ప్రకటన చేయాలి



**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 22:**ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమం లో రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్ ఏర్పాటు కు భూములు, ఇళ్ళు కోల్పోయి, సర్వం త్యాగం చేసిన నిర్వాసితుల సమస్య లు స్పష్ట మైన ప్రకటన చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. అప్పలరాజు డిమాండ్ చేసారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రైవేట్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు లక్షలు, కోట్ల రూపాయిలు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం నిర్వాసితులను ఆదుకోవడం లో పూర్తిగా విఫలం చెందిందని తెలిపారు.

మిట్టల్ ప్రైవేట్ స్టీల్ ప్లాంట్ పెట్టే మొదటి విడత ఎనభైవేల కోట్లు పెట్టుబడులలో రాష్ట్ర ప్రభుత్వం నలభై వేల కోట్లు రూపాయలు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, 2200 ఎకరాలు భూములు కు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు మినహాయింపు ఇచ్చారని, పదిహేను సంవత్సరాల పాటు జీఎస్టీ మినహాయింపు,పదిహేను సంవత్సరాలు పాటు విద్యుత్ యూనిట్ ఒక్క రూపాయికే రాయితీ ఇస్తున్నారన్నారు. కంపెనీ కి కావలసిన నీరు లీటర్ కేవలం యాభై పైసలకే పది సంవత్సరాలు పాటు నీరు అందించేలా ఒప్పందాలకు కుదిరాయన్నారు. ఈ విధంగా ప్రైవేట్ స్టీల్ ప్లాంట్ కు లక్షల కోట్లు రూపాయలు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులను ఎందుకు ఆదుకోవడం లేదని ప్రశ్నించారు.నిర్వాసితులకు ఆర్ కార్డు లు, స్థానికులకు డబ్బై ఐదు శాతం ఉద్యోగాలు పెరిగిన నిర్మాణ సామాగ్రి ధరలకు అనుగుణంగా ప్యాకేజీ ఇరవై ఐదు లక్షలు పెంచి కూటమి ప్రభుత్వం తమ నిజాయితీ నిరూపించుకోవాలని డిమాండ్ చేసారు. నిర్వాసితుల సమస్యలపై శంకుస్థాపన కార్యక్రమంలో స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం. రాజేష్, నాయకులు కె. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు సూర్యపేట లో జరిగే ఐ లు జిల్లా కార్యదర్శి మాడపాక వెంకన్న గారి సంతాప సభను జయప్రదం చేయాలి.

**వలిగొండ మండలం పెన్ సత్తా, మార్చి 22**:ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఐ లు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి పిలుపు




న్యాయవాదుల హక్కుల కోసం న్యాయవాదుల రక్షణ చట్టం కై అనేక ఆందోళన నిర్వహించి న్యాయవాదుల హక్కుల పరిష్కారం కోసం చివర వరకు పనిచేసినటువంటి వ్యక్తి ఆలిండియా లాయర్స్ యూనియన్ ఐ లు సూర్యపేట జిల్లా ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది, మాడపాక వెంకన్న గారి సంతాప సభ 23-3- 2026 రోజున పబ్లిక్ క్లబ్ సూర్యాపేట నందు నిర్వహించడం జరుగుతుందనీ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఐ లు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి జిల్లా అధ్యక్షులు బొల్లేపల్లి కుమార్ తెలిపారు. మాడపాక వెంకన్న ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించారని వారి ఆదర్శాలను ముందుకు తీసుకుపోవాలని వారు అన్నారు.ఈ సంతాప సభకు రాష్ట్ర, జిల్లా నాయకులు, నూతనంగా ఎన్నికైన బార్ కౌన్సిల్ సభ్యులు హాజరవుతారని వారు తెలిపారు. కావున సూర్యాపేట బారసోసియేషన్ సభ్యులు, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని కోర్టుల నుండి జిల్లాలోని న్యాయవాదులు, శ్రేయోభిలాషులు, అందరూ హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు

## ఉపాధి హామీ కూలీలకు కనకరాజు విందు.

- వనభోజనానికి తీసుకు వెళ్లిన సర్పంచ్.
- వారితోపాటు ఆటపాట.





**మారేడుపూడి, పెన్ సత్తా, మార్చి 22 :** మరికొద్ది రోజుల్లో సర్పంచ్ ల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో మారేడుపూడి గ్రామానికి, గ్రామ ప్రజలకు గత ఐదు సంవత్సరాలు సేవ చేసుకునే అదృష్టాన్ని కల్పించినందుకు సర్పంచ్ కనకరాజు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు ఆయన వనభోజనం ఏర్పాట్లు చేశారు. గత ఐదు సంవత్సరాలుగా తను గ్రామానికి ఎంతో సేవ చేశానని, రాబోయే కాలంలో కూడా అవకాశం ఉంటే గ్రామానికి సేవ చేసుకునే అదృష్టాన్ని ఆ దేవుడు కల్పించాలని కోరుకుంటున్నానని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో కాసేపు ముచ్చటించి ఆడుతూ పాడుతూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో మారేడు గ్రామ నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా డీసీసీ కార్యదర్శి చెరుకు శివయ్య గౌడు కు నియామక పత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యే కుంభం.





**వలిగొండ మండలం పెన్ సత్తా, మార్చి 22:**యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోవివేరా హోటల్లో యాదాద్రి భువనగిరి జిల్లా డిసిసి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నియామక పత్రాన్ని అందజేశారు వలిగొండ మండలం సుంకిశాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెరుకు శివయ్య గౌడ్ కు యాదాద్రి జిల్లా డిసిసి కార్యదర్శి పదవి నియమితులైన సందర్భంగా నియామక పత్రాన్ని మన భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి చేతుల అందజేశారు వారు మాట్లాడుతూ మన భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో యాదాద్రి జిల్లా డిసిసి కార్యదర్శి పదవి నియమితులైన నాకు నాపై నమ్మకంతో మన భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో డీసీసీ కార్యదర్శి పదవి ఇచ్చినందున వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మండల పట్టణ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## బోనకల్ రోడ్డు నామవరం క్రాస్ రోడ్ దగ్గర డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కని కలిసిన చింతకాని మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు.



**చింతకాని పెన్ సత్తా, మార్చి 22: ప్రతినిధి.** నామవరం అడ్డరోడ్డు వద్ద తెలంగాణ డిప్యూటీ సీఎం బట్టీ విక్రమార్కగారిని మర్యాదపూర్వకంగా కలిసిన ఖమ్మం మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మదుపల్లి భాస్కర్ గౌడ్ చెన్నకేశవ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఎండపల్లి శ్రీనివాసరావు మాజీ సర్పంచ్ బండి సైదేశ్వర రావు చింతకాని గ్రామ శాఖ అధ్యక్షులు ఎస్కే అబ్దుల్ మజీద్ చెన్నకేశవ స్వామి ఆలయ కమిటీ సభ్యులు బండి తిరపయ్య కొమిని రామారావు పెద్దగౌండ్ల వెంకటనారాయణ తూము భిక్షం మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుకొమ్మిని నాగేశ్వరరావు సూత్రపు రాంబాబు ఆడుకోటేశ్వరరావు ఇట్టా శ్రీనివాసరావు కలవడం జరిగిందిద

# రాష్ట్రంలో ప్రతిరోజూ పండుగే మంత్రి సవిత

- అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం.
- ఎంఎస్ఎంఈ పార్కుల్లో బీసీలకు ప్రాధాన్యం.
- బీసీలకు ఆర్థిక, రాజకీయ గుర్తింపు టీడీపీ తోనే.
- బీసీ రక్షణ చట్టం తుది ముసాయిదా సిద్ధం.
- త్వరలోనే చట్టానికి తుది రూపు.
- జగన్ హయాంలో బీసీల హక్కులు భూ స్థాపితం మంత్రి సవిత ధ్వజం.
- నూజివీడులో వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రులు సవిత, కొలుసు పార్థసారథి.









**నూజివీడు, పెన్ సత్తా, మార్చి 22:** సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రంలో ప్రతి రోజూ పండగేనని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత ఆనందం వెలిబుచ్చారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో బీసీలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. వడ్డెర్లను ఎస్టీలో చేర్చే విషయ మై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడులో ఆదివారం జరిగిన స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారథితో కలిసి మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బ్రిటీషర్ల దాష్టీకాలను ఎదిరించి, మొట్ట మొదటి స్వాతంత్ర్య పోరాటం జరిపిన యోధుడు వడ్డే ఓబన్న అని కొనియాడారు. ఓబన్న చేసిన పోరాటాన్ని ముందు తరాలకు తెలియజేయాలని సీఎం చంద్రబాబు సంకల్పించారన్నారు. దీనిలో భాగంగా ఓబన్న జయంతిని అధికారికంగా, రాష్ట్ర పండుగగా నిర్వహించాలని శాశ్వత జీవో జారీచేశారన్నారు. గత సంవత్సరం గుంటూరులో, ఈ ఏడాది అనంతపురంలో ఓబన్న జయంతిని అధికారికంగా జరుపుకున్నామన్నారు. నూజివీడులో వడ్డే ఓబన్న విగ్రహం ఆవిష్కరించడం అభినందనీయమని మంత్రి సవిత కొనియాడారు.ఎంఎస్ఎంఈ పార్కుల్లో బీసీలకు ప్రాధాన్యం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి సవిత తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసిందన్నారు. ఉగాది సందర్భంగా నిరుద్యోగ యువతకు మంత్రి నారా లోకేష్ శుభవార్త చెబుతూ, జాబ్ క్యాలెండర్ విడుదల చేశారన్నారు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వ పథకాలతో ఎక్కువగా లబ్ధి పొందేది బీసీలేనని మంత్రి స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రంలో ప్రతి రోజూ పండుగ వాతావరణమే ఉంటోందన్నారు. బీసీలను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వాలవేనన్నారు. బీసీ రక్షణ చట్టం తుది ముసాయిదా సిద్ధ మైందని, త్వరలోనే ఈ చట్టాన్ని అమలు చేయనున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు కేబినెట్ లో ఎనిమిది మంది బీసీ మంత్రులకు కీలక శాఖలు అప్పగించారన్నారు. కేంద్ర మంత్రిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన కింజరపు రామ్మోహన నాయుడి కి అవకాశమిచ్చారన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజక వర్గంలోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, వాటిలో బీసీలకు ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి సవిత వెల్లడించారు. అనంతరం పార్థసారథి మాట్లాడుతూ వడ్డెర్లకు చంద్రన్న వెన్నుదన్నుగా నిలిచారన్నారు.

వడ్డెర్ల సామాజిక వర్గీయులకు అన్నివిధాలా సీఎం చంద్రబాబు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని మంత్రి తెలిపారు. వడ్డెరలకు మైనింగ్ లీజుల్లో 15 శాతం రాయితీ కల్పించామన్నారు. వడ్డెరలకు మైనింగ్ లీజు రిజర్వేషన్లు రద్దు చేసిన ఘనుడు జగన్ అని విమర్శించారు. వడ్డెర్లను ఎస్టీలో చేర్చే విషయ మై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు మంత్రి పార్థ సారథి తెలిపారు. జగన్ హయాంలో బీసీల హక్కులు భూ స్థాపితం చేసారన్నారు.

అనంతరం విలేకర్లతో మంత్రి కొలుసు పార్థసారథితో కలిసి, మంత్రి సవిత మాట్లాడారు. బీసీల అభ్యున్నతి కోసం అన్న ఎన్టీఆర్ విశేష కృషి చేశారన్నారు. బీసీలకు సీఎం చంద్రబాబు వెన్నుదన్నుగా నిలిచారన్నారు. జగన్ హయాంలో బీసీల హక్కులు భూ స్థాపితమయ్యాయన్నారు. మెగా డీఎస్సీ నిర్వహించి శభాష్ అనిపించుకున్న మంత్రి నారా లోకేష్ త్వరలో మరో డీఎస్సీ నిర్వహించడానికి సిద్ధమవుతున్నారన్నారు. మహిళల సంక్షేమానికి సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. దీపం 2, స్త్రీ శక్తి, తల్లికి వందనం వంటి ఎన్నో పథకాలు అమలుచేసి, మహిళా పక్షపాతినని సీఎం చంద్రబాబు నాయుడు నిరూపించుకున్నారన్నారు. జగన్ మాత్రం అందుకు విరుద్ధంగా ఆస్తుల కోసం తల్లిని, చెల్లిని కోర్టుకు ఈడ్చారని మంత్రి సవిత మండిపడ్డారు.

అంతకు ముందు నూజివీడుకు వచ్చిన మంత్రి సవితకు కూటమి శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. భారీ ర్యాలీ నిర్వహించి, గజమాలతో సత్కరించి అడుగడుగునా బ్రహ్మరథం పట్టాయి. మంత్రి కొలుసు పార్థసారథితో కలిసి స్వాతంత్ర సమర యోధుడు, రేనాటి వీరుడు వడ్డే ఓబన్న విగ్రహాన్ని మంత్రి సవిత ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర్ల డవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఈశ్వరరావు, డైరెక్టర్లు, ఉమ్మడి కృష్ణా జిల్లా వడ్డెర్ల సంక్షేమ సంఘ ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, వడ్డెర సామాజిక వర్గీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నక్కపల్లి స్టీల్ ప్లాంట్ భూమి పూజకు సర్వం సిద్ధం



సభా ఏర్పాట్లును పర్యవేక్షించిన హోం మంత్రి అనిత



**నక్కపల్లి,పెన్ సత్తా మార్చి 22:** నక్కపల్లి మండలంలో ఏర్పాటు కానున్న అరిసెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి మండలంలో సోమవారం నిర్వహించనున్న స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ హాజరుకానున్నారు. వీరితో పాటు పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో హోం మంత్రి అనిత శంకుస్థాపన జరగనున్న ప్రదేశాన్ని ఆదివారం సందర్శించి సభా ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధాన వేదిక, హెలిపాడ్, గ్యాలరీల వద్ద జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు.సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కూటమి నాయకులకు ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమం పండగ వాతావరణంలో జరుగుతుందని తెలిపారు. ఇది కేవలం భూమి పూజ మాత్రమే కాకుండా రాష్ట్ర అభివృద్ధికి నాంది అని పేర్కొన్నారు. పాయకరావుపేట నియోజకవర్గం అభివృద్ధి చెందిన ప్రాంతంగా మారిందని, స్టీల్ ప్లాంట్ కోసం రైతులు చేసిన త్యాగాలు మరువలేమని అన్నారు. భూములు, గ్రామాలు ఖాళీ చేసి ఇచ్చిన రైతులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. స్టీల్ ప్లాంట్ పరిశ్రమ రాష్ట్రాభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని, దీని ద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆమె పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్‌తో అనకాపల్లి జిల్లా రూపురేఖలు మారనున్నాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

### పార్టీ జెండాలతో కళ కళ లాడిన రహదారులు

స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనకు విచ్చేయుచున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, లోకేష్, వంగలపూడి అనిత లకు స్వాగతం పలుకుతూ భారీ ఎత్తున పార్టీ జెండాలు ఫ్లెక్సీలు, బ్యానర్లతో సభా ప్రాంగణానికి వెళ్లే రహదారులు రెపరెపలాడాయి. జాతీయ రహదారి నుండి కాగిత మీదగా నూతనంగా ఏర్పాటు చేసిన స్టీల్ ప్లాంట్ రోడ్ ఇరువైపులా నాయకులు కార్యకర్తలు అభిమానులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో రహదారి ఆహ్లాదకరంగా మారింది. సభా ప్రాంగణానికి వెళ్లే వాహనాలకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా భారీ ఎత్తున పోలీసు పొందవ వస్తే ఏర్పాటు చేశారు.





## స్థానిక ధర్మసాగర్ లో ఉచిత మేఘ వైద్య శిబిరం ప్రారంభోత్సవం-ఎంపీ కడియం కావ్య



**హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెన్ సత్తా, మార్చి 22**:ధర్మసాగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏరియా సమక్షంలో ఉచితంగా మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ ఎంపీ కడియం కావ్య హాజరైనారు.

కడియం కావ్య గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కూరపాటి ఫౌండేషన్ డాక్టర్ రమేష్, డాక్టర్ రాధిక కు ధన్యవాదములు తెలియపరుస్తూ కూరపాటి ఫౌండేషన్ డాక్టర్ రమేష్ మన ధర్మసాగర్ గ్రామపంచాయతీని ఎంచుకొని ప్రజలందరికీ ఉచిత వైద్యం అందించడం ఎంతో శుభ పరిణామం అని తను మారుమూల గ్రామాలలోని పేద ప్రజలకు అనారోగ్యంతో ఉండడం ప్రత్యేకంగా చూసి వారు వెళ్లలేనటువంటి పరిస్థితిలో కాయకష్టం చేస్తూ ఉన్నటువంటి వారికి ఆ కుటుంబాలకు మేలు చేయాలని సదుద్దేశంతో హాస్పటల్ ఖర్చులు లేకుండా ఉచితంగా వైద్యం అందించాలని మన ముందుకు వచ్చారు. గ్రామాలలో అనారోగ్య పాలై ఎంతోమంది పేద ప్రజలు మరణిస్తూ ఉన్నారు. అటువంటి అంశాలను తెలుసుకొని డాక్టర్ రమేష్ తన మానవత్వమును చూపెడుతూ ఉచిత చికిత్సలు చేస్తూ,ఉచిత మందులు ఇస్తూ, గ్రామ ప్రజలకు మన ధైర్యాన్ని నిబ్బరాన్ని ఇస్తున్నారు. ఈ చికిత్సలు కాకుండా డెలివరీ కేసుకు డబ్బులు లేనటువంటి వారు, పేద కుటుంబానికి చెందినటువంటి వారు కూడా కూరపాటి ఫౌండేషన్ కు వచ్చినట్లయితే ఆ డెలివరీ అయినటువంటి ఆడపాపగా జన్మించినట్లయితే అందుకు ఖర్చు అయ్యే డబ్బులు పూర్తిగా ఉచితంగా చేస్తాము అని భరోసనిస్తూ, ఈ విషయం కూడా తెలియనటువంటి ప్రజలకు తెలియచేయాలని ఉద్దేశం తెలియపరచిశీది .కూరపాటి ఫౌండేషన్ హాస్పిటల్ కు వచ్చి మీరు మీ బాడీని చెకప్ చేసుకుంటే దాదాపుగా తక్కువ ఖర్చుతో మిగిలిన చికిత్సలు చేయబడుతున్నవి, పెద్దపెద్ద హాస్పిటల్ లో అయ్యే ఖర్చుల కంటే మా కూరపాటి ఫౌండేషన్ లో తక్కువ ఖర్చుతో సురక్షితంగా మీ ఆరోగ్యానికి ఎటువంటి హాని ఉండదు. నేను మనస్ఫూర్తిగా తెలియపరుస్తూ ఉన్నాను, ప్రతి గ్రామంలోని ప్రజలు ఇటువంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ కడియం కావ్య అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మసాగర్ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా, సాయి పేట సర్పంచ్ లక్ష్మి, వరంగల్ ఏనుమాముల మార్కెట్ డైరెక్టర్ బొడ్డు ప్రదీప్ కుమార్, కో-ఆపరేటివ్ మాజీ డైరెక్టర్ బొడ్డు లెనిన్, ధర్మసాగర్ ఉపసర్పంచ్ కొంత కొమరమ్మ, మహిళా అధ్యక్షురాలు యామిని, మండల అధ్యక్షుడు గుర్ర ప్రసాద్, గ్రామ అధ్యక్షులు జాలిగాపు దుర్గయ్య, వార్డు మెంబర్లు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కూరపాటి ఫౌండేషన్ సిబ్బంది ధర్మసాగర్ గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## భద్రాద్రి శ్రీ సీతారాముల కళ్యాణాని కి శ్రీరామ నామ లిఖిత తలంబ్రాలు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ పెన్ సత్తా, మార్చి 22**: హైదరాబాద్ కు చెందిన రామ భక్తురాలు చల్వాది విష్ణు వందన భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారికి తన వినూత్న భక్తిని చాటుకున్నారు. 2016 నుండి ప్రతి బియ్యపు గింజ పై అత్యంత సూక్ష్మంగా 'శ్రీరామ' నామాన్ని లిఖిస్తూ, వాటిని 'గోటి తలంబ్రాలు' గా స్వామి వారికి సమర్పిస్తున్నారు. గత పదేళ్లుగా ఆమె కొనసాగిస్తున్న ఈ విశిష్ట సేవను ఆలయ ఈవో దామోదర్ రావు మరియు దేవస్థాన అధికారులు కొనియాడారు. భక్తురాలి అంకితభావాన్ని అభినందిస్తూ, ఈ రామనామ తలంబ్రాలను స్వామివారి కళ్యాణోత్సవంలో వినియోగించనున్నట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి.

**: జిల్లా కలెక్టర్ అంకిత్.**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, మార్చి 22**:మార్చి 23వ తేదీ, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# సి ఎస్ సి హెల్త్ టెస్టులు రద్దు చేయాలి.........

- బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అమలు చేయాలి.
- మార్చి 30న హైదరాబాద్ లేబర్ కమిషనర్ ఆఫీస్ ముందు ధర్నా.....
- వాల్ పోస్టర్ ఆవిష్కరించిన బీసీ డబ్ల్యు ఎఫ్ సి. సిఐటియు నేతలు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ పెన్ సత్తా, మార్చి 22**: నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి సిఎస్సి హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న హెల్త్ టెస్టులను రద్దు చేయాలని టెస్టుల పేరుతో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ విచారణ చేపట్టా లని బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వర్కర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రామ్మోహన్ రావు వంగూరి రాముడు డిమాండ్ చేశారు. మూడు రోజులపాటు జరుగుతున్న రాజకీయ శిక్షణ తరగతులు భాగంగా ఆదివారం జీవో నెంబర్ 12 ను సవరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30 తారీఖున తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్మోహన్రావు వంగూరి రాములు మాట్లాడుతూ

కార్మికులకు సంక్షేమ పథకాలను సంక్షేమ బో ను సవరణ చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా దారిమల్లిస్తుందని విమర్శించారు. ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అవకాశం ఇవ్వటం ద్వారా ప్రభుత్వం అవినీతిని ప్రోత్స హిస్తున్నారు. ఫలితంగా మరణించిన కార్మిక కుటుంబాలకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందని పేర్కొన్నారు. సిఎస్సి హెల్త్ టెస్టుల పేరుతో 500 కోట్ల రూపాయల దుర్వినియోగం జరిగిందని దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిర్మాణ రంగ కార్మికుల సహజ మరణానికి ఇచ్చే పరిహారాన్ని ఐదు లక్షల రూపాయలకు పెంచాలని ,ప్రసూతి కానుక వివాహ కానుక లక్ష రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు .కేరళ, తమిళనాడు, పంజాబ్ ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధంగా 60 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు 3000 పెన్షన్ ఇవ్వాలని కార్మికు కుటుంబాల పిల్లలకు ఉన్నత చదువుల కోసం స్కాలర్షిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సొంత ఇల్లు లేని భవన నిర్మాణ కార్మికులకు ఇల్లులు మంజూరు చేయాలని, ప్రభుత్వాన్ని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ బీసీ డబ్ల్యు ఎఫ్ సి ఐ టి యు డిమాండ్ చేస్తుందని అన్నారు. నూతనంగా ఏర్పడిన జిల్లాల ప్రాతిపదికన జిల్లా కార్మిక శాఖ అధికారులను నియమించాలని ఖాళీగా ఉన్న ఏ ఎల్ ఓ ఏసీఎల్ పోస్టులు భర్తీ చేయాలని కార్మిక శాఖ అధికారుల పరిధిలో పెండింగ్ లో ఉన్న వెల్ఫేర్ బోర్డు క్లైమూలను పరిష్కారం చేయాలని వారు కోరారు .మార్చి 20న ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో కార్మిక సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానం కూడా అమలుకు నోచుకోలేదని అన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం మార్చి 30వ తేదీన హైదరాబాదులో ఉన్న రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు జరుగుతున్న ధర్నాను వేలాదిగా హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు .ఈ సందర్భంగా చలో హైదరాబాద్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్ర విస్తృత సమావేశానికి తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ బీసీ డబ్ల్యు ఎఫ్ సి ఐ టి యు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముదాం శ్రీనివాస్ అధ్యక్షత వహించగా. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఏ రాజు ఎలకా సోమయ్య సిహెచ్ ఉప్పలయ్య పార్వతి కే బ్రహ్మాచారి జి సోములు లక్ష్మయ్య జ్యోతి రాధా పద్మ నాగరాజు శ్రీశైలం శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఉత్సావాలకు తరలి వెళ్లిన, చేగుంట మండల్ వ్యవసాయ రైతులు

**చేగుంట / పెన్ సత్తా, మార్చి 22**:చేగుంట మండల్ వ్యవసాయ అధికారి అధ్యర్యంలో 22.03.2026 ఆదివారం నాడు మన చేగుంట మండలంలోని రైతు సోదరులు మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జరగనున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం మరియు రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని వీక్షించడానికి చేగుంట మండల్ వివిధ గ్రామాల రైతులు వ్యవసాయ విస్తరణ అధికారులు నర్మేట్ గ్రామానికి తరలివెళ్లారు, ఈ కార్యక్రమంలో చేగుంట వ్యవసాయ అధికారి హరిప్రసాద్ మాధవి,రైతు సంఘాల నాయకులు దివాకర్,బాగులు,
కొండి శ్రీనివాస్, కరే స్వామి,కే రాజు, జె మహేందర్, రాకేష్, నర్సింలు, హరి,వివిధ గ్రామల రైతులు పాల్గొనారు,



## వైభవముగా 4వ రోజు శ్రీదేవి వసంత నవరాత్రులు..

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, మార్చి 22**:పాల్వంచ మండలం, కేశవాపురం- జగన్నాధపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి)లో తేది 19.03.2026 న ప్రారంభమైన శ్రీ అమ్మవారి "వసంత నవరాత్రోత్సవముల"లో భాగంగా 4వ రోజు పూజా కార్యక్రమములు వైభవముగా నిర్వహించబడినవి. ఉదయం 5.00 గంవ లకు సుప్రభాత సేవ, ప్రాత: కాలర్చన, శ్రీచక్రార్చన, సూర్యనమస్కారములు, మూలమంత్ర అనుష్టానం, చండీసప్తసతీ పారాయణము, హోమములు, జపములతో పాటు పాశుపత మృత్యుంజయ హోమము అనంతరం 2.30 గం॥ల నుండి మల్లెపూలతో "లక్షకుసుమార్చన", శ్రీ లలితా సహస్ర నామహవనము నిర్వహించబడినవి. రాత్రి 7.30 గంవలకు నీరాజన మంత్రపుష్పము అనంతరం తీర్థ ప్రసాద వితరణ జరుపబడును. ఇట్టి కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీకుమారి, ధర్మకర్తల మండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, ధర్మకర్తలు పెండ్లి రామిరెడ్డి, చీకటి కార్తీక్, చెవుగాని పాపారావు, శనిగారపు శ్రీనివాసరావు, అడుసుమిల్లి సాయిబాబా, చెరుకూరి శేఖర్ బాబు, అర్చకులు, ఋత్వికులు, సిబ్బంది పాల్గొన్నారు.




## నాగలవంచ రైతు వేదికలో ఐ టి సి . ఎం ఎస్ కె ఆదర్శ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం.



**మధిరడివిజన్ వ్యవసాయ అధికారి స్వర్ణ విజయ్ చంద్ర**

**చింతకాని పెన్ సత్తా, మార్చి 22**: **ప్రతినిధి.**చింతకాని ఐమండలంలోని నాగులవంచ గ్రామంలో రైతు వేదిక నందు ×జ-మీఖ మరియు ఆదర్శ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు నేరుగా విత్తుకునే పద్ధతి లో వరి సాగు గురించి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చెయ్యడం జరిగింది.

ఈ సందర్భంగా మధిర డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు స్వర్ణ. విజయ్ చంద్ర మాట్లాడుతూ నేరుగా విత్తుకునే వరి సాగు గురించి, దానిలో పాటించవలసిన పద్ధతుల గురించి, కలుపు యాజమాన్యం, ఎరువులు మరియు మందుల వాడకం గురించి వివరించడం జరిగినది. రైతులకు అన్ని రకముల పంటల గురించి యాజమాన్య పద్ధతులు గురించి వివరించడం జరిగినది. జిల్లా వ్యవసాయ అధికారి ఙ. పుల్లయ్య గారు మాట్లాడుతూ మొక్కజొన్నల కొనుగోలు సీలింగ్ గురించి వివరించడం జరిగినది. ఉద్యానవన అధికారి విష్ణు మాట్లాడుతూ పామాయిల్ సాగు గురించి వివరించడం జరిగినది. ఆదర్శ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.రామకృష్ణ గారు మాట్లాడుతూ ×జ-మీఖ చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించడం జరిగినది. ఆత్మా డైరెక్టర్ కొప్పుల గోవిందరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు మాట్లడుతూ రైతులు నేరుగా విత్తుకునే పద్దతి నీ అలవాటు చేసుకొని లాభాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ూ. మానస, వ్యవసాయ విస్తరణ అధికారులు ఙ. కళ్యాణి,దీ. కార్తీక్, ఆదర్శ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఙ. సత్యనారాయణ మరియు సిబ్బంది,సర్పంచ్, ఉపసర్పంచ్ మరియు రైతులు పాల్గొన్నారు

## అరూరు గ్రామపంచాయతీ పరిధిలో 12వ వార్డులో సీసీ రోడ్డు కు పనులు ప్రారంభోత్సవం.

- ప్రారంభించిన డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి,సర్పంచ్ సుక్క ముత్యాలు.




**వలిగొండ మండలం పెన్ సత్తా, మార్చి 22**: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలో ఉన్న ఆరూరు గ్రామం పంచాయతీ ఆమ్లెట్ గంగాపురం వార్డు నెంబర్ 12 లో. 10 లక్షల రూపాయలు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా సీసీ రోడ్లకు ఎమ్మెల్యే 10 లక్షలు కేటాయించి నా సందర్భంగా స్థానిక సర్పంచ్ సుఖముత్యాలు యాదాద్రి భువనగిరి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి పాల్గొని కొబ్బరికాయ కొట్టి సిసి రోడ్లు పనులను ప్రారంభించినారు,మీడియా ద్వారా డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి మాట్లాడుతూ గంగాపురం ఆమ్లెట్ కు వేములకొండ రోడ్డునుండి గంగాపురం కాలనీకి సిసి రోడ్లు ఎమ్మెల్యే ద్వారా ఏర్పాటు చేయిస్తానని అన్నారు.

సర్పంచ్ మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ గంగాపురం బూతుకు 10 లక్షల రూపాయలు సిసి రోడ్డుకు కేటాయించినందుకు ఎమ్మెల్యేకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినారు. జనరల్ ఫండ్ ద్వారా కూడా ఎమ్మెల్యే ద్వారా నిధులు తెచ్చుకొని గ్రామాన్ని అభివృద్ధి చేయిస్తానని అన్నారు,

12 వ వార్డు నెంబరు సుంకి ఉమారాణి ఆనంద్ మాట్లాడుతూ 12 వ వార్డు కు 10 లక్షల రూపాయలు కేటాయించినందుకు ఎమ్మెల్యేకి డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ గ్రామ పెద్దలు కొడితల కర్ణాకర్ బాలరాజు అరూరుగ్రామ పెద్దలు గంగపురం కాలనీవాసులు దేశపాక కృష్ణ స్వామి దేశపాక ఊసయ్య దేశపాక స్వామి దేశపాక బిక్షపతి తదితరులు పాల్గొన్నారు

## ఆర్ సి యం చర్చిలో ప్రార్థనా కూడికలు



**చింతకాని పెన్ సత్తా, మార్చి 22**:చింతకాని ప్రధాన కేంద్రాల్లో ఉన్నటువంటి ఆర్.సి.యం చర్చిలో ఆదివారం నాడు ఉపవాస ప్రార్థన కూడికలు ఏర్పాటు చేయడం జరిగింది. చర్చి ఫాదర్ శౌరి ప్రసంగిస్తూ దేవుడు మన యొక్క పాపాల కోసం తన యొక్క ప్రాణాలను త్యాగం చేశాడని వివరిస్తూ ఈ యొక్క ఉపవాస రోజుల్లో అందరూ భక్తితో ఉండాలని కలిసిమెలిసి సహృదయంతో మెలగాలని సూచించారు.

యొక్క ప్రార్థన కూడికల్లో సంఘస్తులు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# 2047 నాటికి మన దేశం రిచ్! వేగంగా పెరుగుతున్న జీడీపీ.. ఇదే వేగం ఉంటే 15 వేల డాలర్లకు తలసరి ఆదాయం

న్యూఢిల్లీ: స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి భారత్ సంపన్న దేశంగా మారుతుందని అమెరికా వార్తాసంస్థ వాషింగ్టన్ ఎగ్జామినర్ వెల్లడించింది. దీని స్టడీ రిపోర్ట్ ప్రకారం..?గత రెండు దశాబ్దాలుగా మనదేశం బలమైన ఆర్థిక వృద్ధిని నమోదు చేస్తోంది. 2003 నుంచి భారత ఆర్థిక వ్యవస్థ సగటున ఏడాదికి ఏడు శాతానికిపైగా వృద్ధి రేటు సాధిస్తోంది. ఇదే వేగం మరో 20 ఏళ్ల పాటు కొనసాగితే, తలసరి జీడీపీ 15 వేల డాలర్ల మార్కును దాటుతుంది. దీనివల్ల బ్రెజిల్, దక్షిణాఫ్రికా, టర్కీ వంటి దేశాలు ఎదుర్కొన్న మిడిల్ ఇన్‌కమ్ ట్రాప్ సమస్య నుంచి భారత్ సులభంగా బయటపడవచ్చు. అనుకూలమైన ప్రభుత్వ విధానాలు, యువ జనాభా, పెరుగుతున్న సాంకేతిక పునాది భారత్ వృద్ధికి ఎంతో మేలు చేస్తున్నాయి. సగటు వయసు 28 ఏళ్లు మాత్రమే ఉండటం అమెరికా, చైనా వంటి దేశాల కంటే మనల్ని ముందుంచుతోంది. రాబోయే దశాబ్దాల్లో పెద్ద సంఖ్యలో యువత శ్రామిక శక్తిలో చేరడం వల్ల ఉత్పాదకత పెరిగి వినియోగం కూడా పెరుగుతుంది. దీనివల్ల ఎగుమతులపై ఆధారపడకుండానే స్వదేశీ మార్కెట్ బలోపేతం అవుతుంది. ఉత్పాదకతను మెరుగుపరచడానికి ప్రభుత్వం హైవేలు, విమానాశ్రయాలు, ఓడరేవులు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై భారీగా పెట్టుబడులు పెడుతోంది. సమర్థవంతమైన రవాణా వ్యవస్థ సరఫరా గొలుసును బలోపేతం చేస్తూ ఆర్థిక వ్యవస్థ విస్తరణకు తోడ్పడుతోంది.

**చైనా నుంచి ఇండియాకు..**




ప్రపంచవ్యాప్తంగా సప్లయ్ చెయిన్‌లో వస్తున్న మార్పులు భారత్‌కు కలిసి వస్తున్నాయి. అమెరికా వంటి దేశాలకు చెందిన కంపెనీలు చైనా నుంచి తమ కార్యకలాపాలను భారత్‌కు తరలిస్తున్నాయి. యాపిల్ వంటి అమెరికన్? కంపెనీలు ఇక్కడ తమ ఉనికిని పెంచుకోవడం వల్ల పెట్టుబడులతో పాటు సాంకేతికత కూడా అందుబాటులోకి వస్తోంది. డిజిటల్ మౌలిక సదుపాయాలు, మొబైల్ చెల్లింపులు, ఆన్‌లైన్ ప్రభుత్వ సేవలు లక్షలాది మందిని వ్యవస్థీకృత ఆర్థిక వ్యవస్థలోకి తీసుకువచ్చాయి. స్టార్టప్ సంస్కృతి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఫిన్ టెక్ రంగాల్లో వస్తున్న ఆవిష్కరణలు దేశాన్ని ఉన్నత స్థాయికి చేరుస్తున్నాయి. అవినీతి, రాజకీయ విభజనల వంటి సవాళ్లు ఉన్నప్పటికీ పన్నులు, న్యాయ వ్యవస్థ, విద్య వంటి రంగాల్లో చేపట్టిన సంస్కరణలు దీర్ఘకాలిక వృద్ధికి బాటలు వేస్తున్నాయి. స్టాక్ మార్కెట్ పనితీరు కూడా మదుపర్లలో నమ్మకాన్ని పెంచుతోందని వాషింగ్టన్ ?ఎగ్జామినర్ రిపోర్ట్? ?తెలిపింది.

# నగదు 10 లక్షలు దాటితే PAN.. ఏప్రిల్ 1 నుంచి కొత్త పరిమితులు




ఆర్థిక లావాదేవీల్లో నిత్యం ఉపయోగించే శాశ్వత గుర్తింపు సంఖ్య )కు సంబంధించి కేంద్రం కొన్ని మార్పులు చేపట్టింది. లావాదేవీ పరిమితులను గణనీయంగా పెంచింది. కొత్త ఆదాయపు పన్ను చట్టం-2025 అమలులో భాగంగా కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఆదాయపు పన్ను నిబంధనలు-2026ను నోటిఫై చేసింది. ఇందులో భాగంగా పాన్‌కు సంబంధించిన లావాదేవీ పరిమితులను సవరించింది. ఏప్రిల్ 1 నుంచి ఈ మార్పులు అమల్లోకి రానున్నాయి.

**ఇక 10 లక్షలు దాటితే**

ఒక ఆర్థిక సంవత్సరంలో ఖాతాలో రూ.10 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ నగదు ఒకేసారి లేదా విడతల వారీగా జమ చేసినా, ఉపసంహరించుకున్నా పాన్ వివరాలు ఇకపై ఇవ్వాల్సి ఉంటుంది. ఒకటే బ్యాంకు లేదా వేర్వేరు బ్యాంకుల్లో జరిగినా ఈ నిబంధన వర్తిస్తుంది. ప్రస్తుతం ఒక రోజులో రూ.50 వేలు దాటితేనే పాన్ అడుగుతున్నారు.

**స్థిరాస్తి కొనుగోళ్లు**

ఇళ్లు, స్థలాల కొనుగోలు, అమ్మకం, బహుమతి లేదా ఉమ్మడి డెవలప్‌మెంట్ ఒప్పందాల విషయంలో లావాదేవీ విలువ రూ.20లక్షలు దాటితే ఇకపై పాన్ తప్పనిసరి. ప్రస్తుతం ఈ పరిమితి రూ.10 లక్షలుగా ఉంది. స్థిరాస్తి ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఈ పరిమితిని రెట్టింపు చేయడం గమనార్హం.

**వాహనాల కొనుగోలు**

ద్విచక్ర వాహనం సహా ఏ మోటారు వాహనమైనా, దాని ధర రూ.5 లక్షలు మించితే కొనుగోలుదారుడు పాన్ సమర్పించాల్సి ఉంటుంది. పాత చట్టంలో ద్విచక్ర వాహనాలకు ఈ నిబంధన లేదు. కార్లకు, ఇతర మోటారు వాహనాలకు ధరతో సంబంధం లేకుండా పాన్ సమర్పించాల్సి వచ్చేది. కొత్తగా రూ.5 లక్షల పరిమితిని తీసుకొచ్చారు.

**హోటళ్లు, ఈవెంట్లు, రెస్టారెంట్ బిల్లులు**

హోటళ్లు లేదా రెస్టారెంట్ల బిల్లులు, కన్వెన్షన్ సెంటర్లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలకు చేసే చెల్లింపులు రూ.లక్ష దాటితే ఇకపై పాన్ సమర్పించాలి. ప్రస్తుతం హోటల్, రెస్టారంట్ బిల్లు రూ.50 వేలు దాటితే పాన్ ఇవ్వాల్సి వస్తోంది. ఈ మొత్తాన్ని రెట్టింపు చేశారు.

**బీమా ప్రీమియం**

ప్రస్తుతం బీమా పాలసీ కొనుగోలు సమయంలో వార్షిక ప్రీమియం రూ.50వేలు దాటితేనే పాన్ అడుగుతున్నారు. ఇకపై ప్రతి పాలసీకి పాన్ సమర్పించడం తప్పనిసరి.

# మెమొరీ షాక్



సెమీకండక్టర్ చిప్‌సెట్ల కొరత రెండేళ్ల క్రితం ఎలక్ట్రానిక్ పరికరాలు, వాహనాల తయారీని తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. ఇప్పుడు మెమొరీ చిప్‌లు ధరలు పెరగడం వల్ల స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ ధరలు అంతకంతకూ అధికమవుతున్నాయి. డిర్యామ్, నండ్ స్టోరేజీ వ్యయాలు పెరగడం, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ అంతకంతకూ క్షీణించడం ఈ పరిస్థితికి కారణం. ఫలితంగా గతేడాదితో పోలిస్తే 2026లో స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు 13% తగ్గొచ్చని పరిశ్రమ సంఘాలు అంచనా వేస్తున్నాయి.

**ధరల పెరుగుదలకు కారణాలివీ**

ఫోన్, కంప్యూటర్ వంటి పరికరాల్లో డేటాను శాశ్వతంగా భద్రపరచేందుకు వాడే స్టోరేజీ మాడ్యూల్స్ కోసం సెమీకండక్టర్ చిప్స్ కావాలి. వీటి ధరలు ప్రతినెలా పెరుగుతున్నాయి. ముఖ్యంగా 512 జీబీ, 1 టీబీ మాడ్యూల్స్ ధరలు మరింత అధికమవుతున్నాయి. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లలో కీలకమైన డిర్యామ్ (డైనమిక్ ర్యాండమ్ యాక్సెస్ మెమొరీ), స్టోరేజీ మాడ్యూల్/నండ్ ఫ్లాష్‌కు అంతర్జాతీయంగా కొరత ఎక్కువైంది. ఏఐ (కృత్రిమమేధ) డేటా సెంటర్లకు అవసరమైన హైబ్యాండ్‌విడ్త్ మెమొరీ (హెచ్‌బీఎం) వ్యవస్థలకు అంతర్జాతీయంగా ఒక్కసారిగా గిరాకీ పెరగడం ఇందుకు కారణం. మొమొరీచిప్‌లు తయారు చేసే ఎస్‌కే హైనిక్స్, మైక్రాన్ టెక్నాలజీ, శామ్‌సంగ్ వంటివి తాము తయారు చేస్తున్న మొమొరీ కార్డులను డేటా సెంటర్లకే కేటాయిస్తున్నాయి. ఫలితంగా గత నవంబరు నుంచి వీటి ధరలు 50% పెరిగాయని సమాచారం. అందువల్లే స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీలు ధరలు పెంచేస్తున్నాయి. ల్యాప్‌టాప్‌ల ధరలు కూడా దాదాపు 20-25% పెరిగాయని, వీటి అమ్మకాలూ నిదానిస్తున్నాయని చెబుతున్నారు.

**కైలాష్ లఖ్యానీ**

**డాలర్ ప్రభావం**

డాలర్ విలువ రూ.93ను మించడం వల్ల, విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులన్నీ భారమవుతున్నాయి. స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు దేశీయంగా రూపొందుతున్నా, వాటిల్లోని కీలక విడిభాగాలను దిగుమతి చేసుకుని, ఇక్కడ అసెంబ్లింగ్ చేయిస్తున్నారు. ఇందువల్లే వివో, ఓపో, రియల్‌మి, పోకో, శామ్‌సంగ్, వన్‌ప్లస్, మోటరోలా, షియామీ కంపెనీల ఫోన్ల ధరలు 40% వరకు పెరిగాయి. శామ్‌సంగ్ ప్రీమియం ఫోన్ ఎస్ 26 ధరలను తీసుకుంటే, అదే తరహా ఎస్ 25 కంటే రూ.20,000 ఎక్కువగా ఉంది.

5జీ ఫీచర్ల వల్ల ప్రారంభశ్రేణి స్మార్ట్‌ఫోన్ల ధర రూ.7,500-8000 నుంచి రూ.11,000- 11,500కు చేరింది.

**అమ్మకాలు తగ్గేందుకు..**

స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు తగ్గేందుకు, ధరలు పెరగడంతో పాటు రాయితీలు తగ్గడమూ కారణమని చెబుతున్నారు. ముడిపదార్థాలు, విడిభాగాల ధరలు పెరిగిన నేపథ్యంలో.. ఆన్‌లైన్ పోర్టళ్లు, విక్రయశాలలు కూడా ఫోన్లపై రాయితీలు తగ్గించేశాయి. స్మార్ట్‌ఫోన్ల అమ్మకాల్లో 60% వరకు రూ.25,000లోపువే ఉంటాయి. ఈ విభాగ కొనుగోలుదార్లకు ధర-రాయితీ అత్యంత ఆకర్షణీయం. వీటిల్లో ప్రతికూలత వల్ల, కొనుగోలు నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నారు.

**మారుతున్న కొనుగోలుదార్ల ధోరణి**

కొత్త ఫోన్ల ధరలు పెరగడంతో, ప్రారంభస్థాయి కొనుగోలుదార్లు సెకండ్‌హ్యాండ్ మార్కెట్‌ను ఆశ్రయిస్తున్నారని ఆలిండియా మొబైల్ రిటెయిలర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ కైలాష్ లఖ్యానీ 'ఈనాడు'కు తెలిపారు. ఇందువల్ల సంప్రదాయ విక్రయశాలల్లో స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు ఈ ఏడాది జనవరి - ఫిబ్రవరి మధ్య 35% తగ్గాయని, మార్చిలోనూ నెమ్మదిగానే ఉన్నాయని వివరించారు. యుద్ధ పరిస్థితుల వల్ల, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగితే, ఫోన్లు - ల్యాప్‌టాప్‌ల అమ్మకాలపై మరింత ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు.

## అమెజాన్ నుంచి ఏఐ స్మార్ట్‌ఫోన్

సొంతంగా ఏఐ (కృత్రిమమేధ) స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరించేం దుకు ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ సన్నాహాలు చేస్తోంది. వాయిస్ అసిస్టెంట్ అలెక్సాతో పాటు అభివృద్ధి చేసిన అమెజాన్ సర్వీసెస్‌తో అనుసంధానం అయ్యేలా ఈ ఫోన్ ఉంటుందని సమాచారం. ఇది సంప్రదాయ స్మార్ట్‌ఫోన్ లాగా పనిచేస్తుందని.. దీంతోపాటు ఏఐ సేవలూ అందిస్తుందని చెబుతున్నారు. అమెజాన్ యాప్‌పై మరింత సులభంగా కొనుగోళ్లు చేసేందుకు, ప్రైమ్‌లో వీడియోలు చూసేందుకు, అమెజాన్ మ్యూజిక్‌లో సంగీతం ఆలకించేందుకు, ఆహార డెలివరీ సేవలు పొందేందుకు ఉపయోగపడేలా ఈ స్మార్ట్‌ఫోన్‌ను తీర్చిదిద్దాలన్నది అమెజాన్ ప్రణాళిక. ఈ ఫోన్ ధర ఎంత ఉండొచ్చు, ఎప్పుడు విపణిలోకి రావచ్చు, ప్రాజెక్టు ఆర్థిక వివరాల వంటివీ తెలియరాలేదు. ఒకవేళ అనుకున్నట్లు రాకపోతే, ఈ ప్రాజెక్టును పక్కనపడేసే వీలూ ఉందని తెలిసింది.




## అమెజాన్ స్ప్రింగ్ సేల్.. ఫ్యాషన్ ప్రొడక్టులపై ఆఫర్లు




న్యూఢిల్లీ: అమెజాన్ స్ప్రింగ్ సేల్‌షాపింగ్ ఆఫర్లను ప్రకటించింది. నైకీ, రేమండ్, లేవీస్ వంటి ప్రముఖ బ్రాండ్లపై 50 శాతం వరకు తగ్గింపును అందిస్తోంది. నైకీ, రేర్ ర్యాబిట్, ద సోల్డ్ స్టోర్, రే-బ్యాన్, రేమండ్, లెన్, స్కార్ట్, గెస్, సస్సాఫ్రాస్, టోక్యో టాకీస్, గ్యాప్,లివైస్, స్కెచెర్స్, ప్యూమా, మినిమలిస్టు వంటి బ్రాండ్ల ప్రొడక్టులపై ఆఫర్లు ఉన్నాయని తెలిపింది. చాలా ప్రొడక్టులపై 50 శాతం వరకు తగ్గింపుతో పాటు ప్రత్యేకమైన కూపన్‌ములతో 5 శాతం డిస్కౌంట్ పొందవచ్చని పేర్కొంది. ఏఐ షాపింగ్ అసిస్టెంట్ రూఫస్ ద్వారా వినియోగదారులు తమకు నచ్చిన దుస్తులను, బ్యూటీ ప్రొడక్టులను సులభంగా వెతకవచ్చు, ఫొటోను అప్‌లోడ్ చేసి అచ్చం అలాంటి ఉత్పత్తులనే గుర్తించవచ్చని అమెజాన్ వివరించింది.

## మధుమేహ రోగులకు ఊరట




మధుమేహం, దీర్ఘకాలిక ఊబకాయం (అధిక బరువు) సమస్యలు ఉన్నవారి చికిత్సకు సమర్థంగా ఉపయోగపడే 'సెమాగ్లుటైడ్' ఔషధం సామాన్యులకూ అందుబాటులోకి రానుంది.

అంతర్జాతీయంగా 'ఓజెంపిక్', 'విగోవి' వంటి బ్రాండ్ల పేర్లతో ఆదరణ పొందిన ఈ మందు.. శరీరంలో జీఎల్‌పీ-1 హార్మోన్ తరహాలో పనిచేసే ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచుతుంది. గ్లూకోజ్ స్థాయిలను తగ్గిస్తుంది. ఈ బ్రాండ్‌ను ఆవిష్కరించిన నోవో నార్డిస్క్ ఉత్పత్తి చేస్తున్న మందుల ధరలు అధికంగా ఉండటంతో, మనదేశంలో సామాన్యులు వినియోగించడం కష్టంగా ఉంది. ఈ మందుకు సంబంధించిన మాలిక్యూల్ పేటెంట్ గడువు మనదేశంలో ముగిసిన నేపథ్యంలో, డాక్టర్ రెడ్డీస్, గ్లెన్‌మార్క్, జైడస్, టొరెంట్, ఆల్కెమ్, యూఎస్‌వీలాంటి భారతీయ ఫార్మా దిగ్గజాలన్నీ శనివారం తమ జనరిక్ సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్లు, ఓరల్ మందులను మార్కెట్లో విడుదల చేశాయి. నాట్కో ఫార్మా శుక్రవారమే విడుదల చేసిన సంగతి విదితమే. బ్రాండెడ్ మందులతో పోలిస్తే బాగా తక్కువ ధరకే ఈ జనరిక్ వెర్షన్లు అందుబాటులోకి వస్తుండటం, సామాన్యులకు ఊరట కలిగించే అంశమే.

డాక్టర్ రెడ్డీస్ 'ఒబెడా' పేరుతో ఇంజెక్టబుల్ సెమాగ్లుటైడ్‌ను ప్రవేశపెట్టింది. 2, 4 ఎంజీ మోతాదుల్లో డిస్పోజబుల్ పెన్నుల రూపంలో ఈ మందును తీసుకొచ్చింది. వారానికి ఒకసారి మాత్రమే దీన్ని తీసుకోవాలి. ప్రతి పెన్ ద్వారా కనీసం 4 వారాలకు సరిపడా డోసులు అందుతాయని, నెలకు రూ.4,200 ఖర్చు అవుతుందని సంస్థ సీఈఓ ఎరెజ్ ఇజ్రాయెలీ తెలిపారు.

యూఎస్‌వీ సైతం డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ భాగస్వామ్యంతో యూసెమా బ్రాండ్ పేరుతో జనరిక్ సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్‌ను భారత్‌లో విడుదల చేసింది.

సన్ ఫార్మా నావెల్‌ట్రీట్, సెమాట్రినిటీ పేర్లతో ఇంజెక్షన్లను విడుదల చేసింది. నావెల్‌ట్రీట్‌ను ఊబకాయ చికిత్సకు ఉపయోగిస్తారు. దీనికి వారానికి రూ.900 - 2,000 వరకు ఖర్చవుతుంది. సెమాట్రినిటీని టైప్-2 మధుమేహ చికిత్సకు ఉపయోగిస్తారు. దీనికి వారానికి రూ.750-1,300 ఖర్చు అవుతుందని కంపెనీ తెలిపింది.

గ్లెన్‌మార్క్ ఫార్మా టైప్-2 మధుమేహం కోసం 'గ్లిపిక్' బ్రాండ్‌ను తీసుకొచ్చింది. వయల్స్ రూపంలో లభించే ఈ మందు కోసం వారానికి రూ.325 - 440 ఖర్చవుతుంది.

జైడస్ లైఫ్‌సైన్సెస్ సెమాగ్లిన్, మాషెమా, ఆల్టర్‌మెట్ పేర్లతో జనరిక్ వెర్షన్లను విడుదల చేసింది. నెలవారీ చికిత్సకు సగటున రూ.2,200 ఖర్చవుతుంది.

ఆల్కెమ్ లేబొరేటరీస్.. సెమాసైజ్, ఒబెస్మా, హెపాగ్లైడ్ పేర్లతో సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్లను విడుదల చేసింది. ముందుగానే నింపిన డిస్పోజబుల్ ఇంజెక్షన్ పెన్ ప్రారంభ ధరను నెలకు రూ.1,800 (వారానికి రూ.450)గా నిర్ణయించింది. ప్రతిసారీ కొత్త పెన్ కొనాల్సిన అవసరం లేకుండా, కేవలం మందు ఉన్న కాట్రిడ్జ్ మార్చుకుని, తిరిగి వినియోగించుకునే పెన్‌ను ఆల్కెమ్ ప్రత్యేకంగా తీసుకొచ్చింది.

టొరెంట్ ఫార్మా.. సెంబోలిక్, సెమాలిక్స్ పేర్లతో ఓరల్, ఇంజెక్షన్ రూపాల్లో తీసుకొచ్చింది.

## కొబ్బరి నీళ్లు vs నిమ్మరసం: ఎండాకాలంలో మీ శరీరానికి ఏది బెస్ట్ ?

వేసవి తాపాన్ని తగ్గించుకోవడానికి కొబ్బరి నీళ్లు, నిమ్మరసం రెండూ అమృతంతో సమానం. అయితే వీటిలో ఏది ఎప్పుడు తాగాలో, దేని వల్ల ఎలాంటి లాభం ఉంటుందో మీకు తెలుసా....

ఎండలు ముదురుతున్నప్పుడు మన ఒంట్లో నీటి శాతం తగ్గిపోకుండా చూసుకోవడం చాలా ముఖ్యం. ద్రవపదార్థాలు తాగడం వల్ల చెమట రూపంలో పోయిన నీటిని తిరిగి పొందవచ్చు. మరి కొబ్బరి నీళ్లు, నిమ్మరసంలో ఏది బెస్ట్ చూద్దామా.....

**1. కొబ్బరి నీళ్లు**

ఇందులో పొటాషియం, సోడియం, మెగ్నీషియం ఇంకా కాల్షియం పుష్కలంగా ఉంటాయి. ఇవి మన కండరాలు సరిగ్గా పనిచేయడానికి, అలసట రాకుండా ఉండటానికి సహాయపడతాయి. ఎండలో తిరిగి బాగా నీరసించిపోయినప్పుడు కొబ్బరి నీళ్లు తాగితే వెంటనే శక్తి వస్తుంది. కొబ్బరి నీళ్లు కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా చేస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. కొబ్బరి నీళ్లు ఎప్పుడు తాగాలంటే మీరు ఎండలో ఎక్కువ సేపు పని చేసినా లేదా వ్యాయామం చేసినా కొబ్బరి నీళ్లు తాగడం ఉత్తమం.

**2. నిమ్మరసం**

ఇందులో విటమిన్-సి ఎక్కువగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇంకా ఎండ వల్ల చర్మం పాడవ్వకుండా కాపాడుతుంది. నిమ్మరసం తిన్న ఆహారం అరగడానికి, ఎసిడిటీ తగ్గించడానికి సహాయపడుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి నిమ్మరసం చాలా మంచిది. ఎప్పుడు తాగాలంటే భోజనం తర్వాత లేదా రోజంతా రిఫ్రెషింగ్‌గా ఉండాలనుకుంటే నిమ్మరసం బెస్ట్.

పెన్ సత్తా

## ఎడిటోరియల్

# మూడో ప్రపంచ యుద్ధం దిశగా ప్రపంచం వెళ్లుతోందా?

ప్రస్తుతం ప్రపంచం ఒక అగ్నిపర్వతం మీద కూర్చున్నట్లు కనిపిస్తోంది. మధ్యప్రాచ్యంలో మండుతున్న యుద్ధ జ్వాలలు కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణగా మిగిలిపోకుండా క్రమంగా ప్రపంచ యుద్ధం వైపు అడుగులు వేయిస్తున్నాయా? అన్న అనుమానాలు బలపడుతున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ వాణిజ్యానికి గుండెకాయ వంటి హోర్ముజ్ జలసంధి చుట్టూ ఇరాన్ చేపడుతున్న దూకుడు చర్యలు.. దానికి ప్రతిగా పశ్చిమ, గల్ఫ్ దేశాలు ఏకం కావడం ప్రపంచవ్యాప్తంగా పెను సంచలనాన్ని సృష్టిస్తోంది.

**హోర్ముజ్ జలసంధి: ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఊపిరితిత్తులు**

ప్రపంచ చమురు రవాణాలో సుమారు 20 నుంచి 30 శాతం వాటా కలిగిన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ దాదాపు దిగ్బంధం చేయడం అంతర్జాతీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ మార్గం గుండానే గల్ఫ్ దేశాల నుంచి యూరప్, ఆసియా దేశాలకు ముడి చమురు సరఫరా అవుతుంది. ఇరాన్ ఈ మార్గాన్ని అడ్డుకోవడంతో చమురు ధరలు ఆకాశాన్నంటడమే కాకుండా యూరప్ దేశాల్లో తీవ్ర ఇంధన సంక్షోభం తలెత్తింది. గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో పరిశ్రమలు మూతపడే పరిస్థితి రావడం.. ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలపడం అక్కడి దేశాధినేతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

**ఇరాన్‌కు వ్యతిరేకంగా ప్రపంచ దేశాల మహాకూటమి**

ఇరాన్ ఏకపక్ష చర్యలను అడ్డుకునేందుకు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 22 దేశాలు ఒకే వేదికపైకి వచ్చాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వంటి గల్ఫ్ దేశాలతో పాటు, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, కెనడా, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా వంటి దేశాలు సంయుక్త ప్రకటన విడుదల చేయడం ఇరాన్‌కు బలమైన సంకేతం పంపింది.

**ఈ కూటమి ప్రధాన డిమాండ్లు ఇవే**

ఆయుధాలు లేని పౌర నౌకలపై దాడులు చేయడం అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనేనని దేశాలు పేర్కొన్నాయి. ఇక సముద్ర మార్గాల్లో మైన్లు వేయడం, డ్రోన్లు, క్షిపణులతో భయాందోళనలు సృష్టించడం వెంటనే ఆపాలి. ఐక్యరాజ్యసమితి తీర్మానం 2817 ప్రకారం నౌకల రాకపోకలకు ఆటంకం కలిగించకూడదని తీర్మానించాయి.

**తగ్గేదే లేదంటున్న ఇరాన్.. ఆందోళనలో అగ్రరాజ్యాలు**

ప్రారంభంలో అమెరికా, ఇజ్రాయిల్ దాడులకు ఇరాన్ వెనక్కి తగ్గుతుందని భావించినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. తన అగ్రశ్రేణి కమాండర్లను కోల్పోయినప్పటికీ ఇరాన్ మరింత పట్టుదలతో ప్రతిదాడులు చేస్తోంది. ముఖ్యంగా ఇజ్రాయిల్ నగరాలపై క్షిపణుల వర్షం కురిపించడంతో అక్కడ భీతిగొల్పే వాతావరణం నెలకొంది. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు సైతం ఈ పరిస్థితిని "అత్యంత భయంకరమైన కాళరాత్రి"గా వర్ణించడం యుద్ధ తీవ్రతకు అద్దం పడుతోంది. మరోవైపు అగ్రరాజ్యం అమెరికా కూడా సందిగ్ధంలో పడింది. ఇరాన్ యొక్క ఈ స్థాయిలో ప్రతిఘటనను ఊహించని అమెరికా ఇప్పుడు ఈ సంక్షోభాన్ని ఎలా ముగించాలో తెలియక తలమునకలవుతోంది. ఒకప్పుడు ప్రపంచ శాంతిని శాసించిన దేశాలు సైతం ఇప్పుడు అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతున్నాయి.

**గల్ఫ్ దేశాల ఆందోళన వెనుక అసలు కారణం**

గతంలో ఇరాన్ పట్ల కొంత మెతక వైఖరి అవలంబించిన గల్ఫ్ దేశాలు, ఇప్పుడు నేరుగా రంగంలోకి దిగడానికి కారణం వారి ఆర్థిక మూలాలపై దాడులు జరగడమే. చమురు శుద్ధి కేంద్రాలు, గ్యాస్ పైప్‌లైన్ల రక్షణ ప్రశ్నార్థకంగా మారడంతో సొంత భద్రత కోసం అవి పశ్చిమ దేశాలతో చేతులు కలిపాయి. ఇది కేవలం భౌగోళిక రాజకీయ పోరాటం మాత్రమే కాదు.. ప్రపంచ మనుగడకు సంబంధించిన ఆర్థిక పోరాటంగా మారింది.

**యుద్ధం వైపునా.. శాంతి వైపునా?**

ప్రస్తుత పరిస్థితులు కేవలం ప్రాంతీయ ఘర్షణలా కనిపించడం లేదు. అగ్రరాజ్యాల ప్రత్యక్ష జోక్యం, కీలక జలసంధుల మూసివేత, ప్రపంచ దేశాల ధృవాలుగా చీలిపోవడం వంటివి చూస్తుంటే మూడో ప్రపంచ యుద్ధం కేవలం అంచనా మాత్రమే కాదేమో అనిపిస్తోంది. హోర్ముజ్ జలసంధి సమస్య పరిష్కారం కాకపోతే, ప్రపంచం పెను ఆర్థిక మాంద్యంలోకి జారుకోవడం ఖాయం. దౌత్యపరమైన చర్చలు విఫలమైతే, మానవాళి మరో మహా వినాశనాన్ని చూడక తప్పదు.

ప్రపంచ దేశాల ఈ ఉమ్మడి హెచ్చరికకు ఇరాన్ తలొగ్గుతుందా? లేక యుద్ధమే శరణ్యమని ముందుకు సాగుతుందా? అన్నది రాబోయే కొద్ది రోజుల్లో తేలిపోనుంది.

# చెరుకు రసం తాగుతున్నారా?




వేసవి కాలం ప్రారంభమైంది. ఎండలు బాగా దంచి కొడుతున్నాయి. ఈ అధిక ఉష్ణోగ్రతల వల్ల శరీరం అలసిపోయి, డీహైడ్రేషన్ కు గురవుతుంది. దాహార్తిని తీర్చుకోవడానికి, శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి చాలా మంది పండ్ల రసాలు, ఐస్ క్రీమ్‌లు, నిమ్మకాయ సోడా, బాదం పాలు, ద్రాక్ష పండ్ల జ్యూసు వంటివి ఆశ్రయిస్తారు. వేసవిలో చెరుకు రసం ఉపశమనం అందించినప్పటికీ, అధికంగా తాగడం ఆరోగ్యానికి మంచిది కాదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేసవి కాలం ప్రారంభమైంది. ఎండలు బాగా దంచి కొడుతున్నాయి. ఈ అధిక ఉష్ణోగ్రతల వల్ల శరీరం అలసిపోయి, డీహైడ్రేషన్ కు గురవుతుంది. దాహార్తిని తీర్చుకోవడానికి, శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి చాలా మంది పండ్ల రసాలు, ఐస్ క్రీమ్‌లు, నిమ్మకాయ సోడా, బాదం పాలు, ద్రాక్ష పండ్ల జ్యూసు వంటివి ఆశ్రయిస్తారు. వీటిలో చెరుకు రసం చాలా ప్రజాదరణ పొందిన పానీయం.. ఖర్చు తక్కువ.. లాభాలు ఎక్కువగా ఉంటాయి.. అయితే, చెరుకు రసం తీసుకోవడం విషయంలో జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాస్తవానికి చెరుకు రసం మంచిది.. ఎందుకంటే ఇందులో మెగ్నీషియం, మాంగనీస్, జింక్, ఐరన్, కాల్షియం, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు వంటి ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. ఈ పోషకాలు మన శరీరానికి అవసరమైనవే. కానీ, ఎక్కువగా తాగొద్దు అని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఈ రసం అధికంగా సేవించడం వల్ల ఆరోగ్యానికి మంచిది కాదని వారి అభిప్రాయం. చెరుకు రసం ఎండాకాలంలో శరీరానికి తక్షణ శక్తిని ఇవ్వడంతోపాటు.. చలువ చేస్తుంది. ఇది కాలేయ పనితీరును, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇంకా మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుతుంది.. రోగనిరోధక శక్తిని పెంచడంతోపాటు.. చర్మ సంరక్షణకు సహాయపడుతుంది. వైద్య నిపుణుల ప్రకారం.. ఒక గ్లాసు చెరుకు రసంలో సుమారు 250 కేలరీలు, 100 గ్రాముల చక్కెర ఉంటుంది. ఈ అధిక చక్కెర కంటెంట్, కేలరీలు రోజువారీ లేదా అధిక మోతాదులో తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలకు దారితీయవచ్చు. ముఖ్యంగా, దీనివల్ల ఊబకాయం వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని వారు సూచిస్తున్నారు. ఊబకాయం అనేది అనేక ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు మూల కారణం.. అంతేకాకుండా, చెరుకు రసం అధికంగా తాగడం వల్ల కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ కూడా రావచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ సైడ్ ఎఫెక్ట్స్ రోగాలకు దారితీసి, చివరకు ఆసుపత్రుల పాలు కావాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. అప్పుడు వైద్య ఖర్చులు కూడా ఎక్కువ అవుతాయి. కాబట్టి, వేసవిలో శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడానికి ఏ పానీయాలు మంచివి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలపై సరైన అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యం. మనకు

అందుబాటులో ఉండే వైద్య నిపుణులను సంప్రదించి, వారి సలహాలు పాటించడం ఉత్తమం. ఆరోగ్యానికి ఎప్పుడు ఏమి అవుతుందో తెలియదు కాబట్టి, వేసవిలో శరీరాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. వైద్యుల సూచనలను పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు.

# రాగిజావ.. ఇక టిఫిన్ అక్కర్లేదు




రాగి జావ చిరుధాన్యాల్లో ఒకటి. ఇది కాల్షియం, ఐరన్, పీచుపదార్థాలతో నిండిన ఆరోగ్యకరమైన అల్పాహారం. ఫెర్మెంటెడ్ రాగి జావ జీర్ణవ్యవస్థకు, బరువు తగ్గడానికి ఉపకరిస్తుంది. పిల్లలకు మెదడు అభివృద్ధి, ఎముకల పెరుగుదలకు తోడ్పడుతుంది. ఇది ముఖ్యంగా అల్పాహారంగా తీసుకోవడానికి అనువైనది. సమయం లేనివారు లేదా మార్పు కోరుకునే వారికి రాగి జావ ఒక మంచి ప్రత్యామ్నాయం.

రాగుల్లో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. అందుకే.. రాగి జావ మన దైనందిన ఆహారంలో చేర్చుకోవడానికి ఎంతో ఆరోగ్యకరమైన ఎంపిక అని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.. వాస్తవానికి రాగులు చిరుధాన్యాల కోవకు చెందినవి.. రాగి జావ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, ఎవరు తీసుకోవాలి, ఎవరు తీసుకోకూడదు వంటి అంశాలను ఈ కథనంలో తెలుసుకుందాం.. రాగి జావలో కాల్షియం, ఐరన్, పీచుపదార్థాలు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా ఉదయం అల్పాహారంగా రాగి జావ తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చు. ఇడ్లీ, దోశ వంటి సంప్రదాయ అల్పాహారాలకు సమయం లేని వారికి లేదా తేలికపాటి ఆహారాన్ని ఇష్టపడే వారికి రాగి జావ ఉత్తమ ప్రత్యామ్నాయం. ఇది శరీరానికి అవసరమైన పోషకాలను అందించి, రోజంతా శక్తివంతంగా ఉండటానికి సహాయపడుతుంది.

మధుమేహులు రాగి జావ తీసుకునే విషయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. రాగి జావ గ్లైసెమిక్ ఇండెక్స్ మధ్యస్థంగా ఉండటం వలన, కొంతమందిలో రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. అందువల్ల, మధుమేహులు రాగి జావను నివారించడం లేదా తప్పనిసరిగా తీసుకోవాలని భావిస్తే, పరిమిత మోతాదులో తీసుకుంటూ చక్కెర స్థాయిలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం మంచిది. రాగి జావను వివిధ రకాలుగా తయారుచేసుకోవచ్చు. దీనిని పాలు, మజ్జిగ లేదా పెరుగుతో కలిపి తీసుకోవచ్చు. అయితే, ఫెర్మెంటెడ్ రాగి జావ మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఫెర్మెంటెడ్ రాగి జావ అంటే, ముందు రోజు రాగి పిండిని పులియబెట్టి, దానిని మరుసటి రోజు ఉదయం పెరుగు లేదా మజ్జిగతో కలిపి తీసుకోవడం. ఈ విధంగా తీసుకోవడం వల్ల ఇది మంచి ప్రీబయోటిక్‌గా పనిచేసి, జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. గట్ హెల్త్ బాగుంటుంది. అసిడిటీ, గ్యాస్ట్రిక్ సమస్యలున్న వారికి ఇది ఎంతో ఉపశమనం కలిగిస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇది తేలికపాటి, పోషకమైన ఆహారంగా ఉపయోగపడుతుంది. ఉదయం పూట భారీగా కాకుండా తేలికగా, సౌకర్యవంతంగా ఉండాలనుకునే వారికి రాగి జావ ఒక అద్భుతమైన ఎంపిక.. చిన్నపిల్లలకు రాగి జావను మంచి స్నాక్‌గా ఇవ్వవచ్చు. పాఠశాల నుంచి వచ్చిన తర్వాత లేదా ఆకలిగా ఉన్నప్పుడు, రాగి జావలో కొద్దిగా బెల్లం, ఒక స్పూన్ స్వచ్ఛమైన ఆవు నెయ్యి కలిపి ఇవ్వడం వల్ల రుచితో పాటు ఆరోగ్యం కూడా లభిస్తుంది. ఆవు నెయ్యిలో ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి, ఇవి పిల్లల మెదడు పనితీరు, జ్ఞాపకశక్తి అభివృద్ధికి ఎంతగానో తోడ్పడతాయి. అంతేకాకుండా, చిన్నపిల్లలకు ఎముకల పెరుగుదలకు అవసరమైన కాల్షియం రాగి జావ ద్వారా లభిస్తుంది. టీనేజర్లలో హిమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉన్నట్లయితే, రాగి జావ తీసుకోవడం వల్ల అవి మెరుగుపడతాయి. ఎముకల అభివృద్ధికి కూడా ఇది సహాయపడుతుంది. మలబద్ధకంతో బాధపడేవారికి రాగి జావలోని పీచుపదార్థాలు ఎంతో ఉపకరిస్తాయి. ఇది జీర్ణవ్యవస్థను మెరుగుపరచి, మలబద్ధకం నుండి ఉపశమనం కలిగిస్తుంది. అందువల్ల, రాగి జావను రోజూ లేదా కనీసం వారానికి మూడు నుంచి నాలుగు సార్లు అయినా తీసుకోవడం వల్ల ఈ ప్రయోజనాలను పొందవచ్చు. ఇది ప్రకృతిసిద్ధంగా లభించే, మన శరీరానికి ఎంతో మేలు చేసే ఆహారం. ఆరోగ్యకరమైన జీవితం కోసం రాగి జావను మీ రోజువారీ ఆహారంలో భాగం చేసుకోండి.

# మోషన్ ఫ్రీగా అవ్వడం లేదా..?



కుప్పింటాకు ప్రకృతి ప్రసాదించిన అద్భుత ఔషధం. ఇది కండరాల నొప్పులను తగ్గించడంలో, డయాబెటిక్ పుండ్లను మాన్పడంలో, ఆస్తమా, బ్రోంకైటిస్ వంటి శ్వాసకోశ సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. అలాగే, మలబద్ధకం, చెవి ఇన్ఫెక్షన్లకు కూడా ఉపశమనాన్నిస్తుంది. ప్రకృతి వైద్య విధానంలో మందులు లేకుండా జబ్బులు తగ్గించుకోవడానికి మంచి ఆహార నియమాలు, అలవాట్లను మార్చుకోమని సూచిస్తారు. అయితే, కొద్దిమందికే ఈ నియమాలను పాటించడం ఇష్టమవుతుంది. చాలామందికి ఆహారపు అలవాట్లను మార్చుకోవడం కష్టంగా అనిపిస్తుంది. అలాంటి వారి కోసం, కొన్ని రకాల సమస్యలను తగ్గించుకోవడానికి ప్రకృతి సిద్ధమైన ఔషధాలు, ఆకులు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆయుర్వేద వైద్యులు అందించబడిన ఈ సమాచారం ప్రకారం, కుప్పింటాకు ఐదు రకాల ఆరోగ్య లాభాలను అందిస్తుంది. 1. కండరాల నొప్పుల నివారణ: కుప్పింటాకు కషాయం కండరాల నొప్పుల నుండి తక్షణ ఉపశమనాన్ని ఇస్తుంది. ఐదారు ఆకులను నీటిలో మరిగించి, ఆ నీటిని త్రాగడం వల్ల ఇందులో ఉండే పాలిఫినాల్స్, ఇతర రసాయన సమ్మేళనాలు కండరాలను రిలాక్స్ చేస్తాయి. కండర కణాలలో వచ్చే వాపును తగ్గించి, నొప్పులకు కారణమయ్యే ప్రోస్టాగ్లాండిన్స్ ఉత్పత్తిని తగ్గించడంలో ఇది సమర్థవంతంగా పనిచేస్తుంది. అలసటగా, నొప్పులుగా ఉండే కండరాలకు కుప్పింటాకు రసం సైంటిఫిక్‌గా ప్రయోజనకరంగా ఉంటుందని రుజువైంది. 2. డయాబెటిక్ పుండ్లు, గాయాల మానుపు: డయాబెటిస్ ఉన్నవారికి దెబ్బలు, పుళ్ళు, గాయాలు మానడం కష్టమవుతుంది, కొన్నిసార్లు గ్యాంగ్రీన్ వంటి తీవ్ర సమస్యలకు దారితీస్తుంది. మానకుండా ఉన్న అలాంటి గాయాలపై కుప్పింటాకు రసాన్ని వేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది. ఈ రసంలో ఉండే గ్యాలిక్ ఆసిడ్, ఎలాజిక్ ఆసిడ్ యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు కలిగి ఉంటాయి. ఇవి గాయం ప్రాంతంలోని బ్యాక్టీరియా, ఫంగస్ క్రిములను చంపి, వాపును తగ్గించి, పుండు మానడానికి తోడ్పడతాయి. అంతేకాకుండా, పుండు భాగంలో కొలాజన్ మెష్ ఏర్పడటాన్ని ప్రోత్సహించి, సాధారణ చర్మం వేగంగా అభివృద్ధి చెందడానికి సహాయపడుతుంది. 3. శ్వాసకోశ ఆరోగ్యానికి (ఆస్తమా, దగ్గు, కఫం): కుప్పింటాకులో ఉండే సపోనిన్స్, ఫినాల్స్ ఆస్తమా, దగ్గు, కఫం, శ్లేష్మాలు ఎక్కువగా ఉన్నవారికి, ఊపిరితిత్తులలో వాపు (బ్రోంకైటిస్) ఉన్నవారికి ఉపయోగపడతాయి. ఐదారు కుప్పింటాకులను నీటిలో మరిగించి, వడకట్టిన కషాయానికి తేనె కలుపుకొని త్రాగడం వల్ల ఊపిరితిత్తులలో శ్లేష్మం ఉత్పత్తి చేసే కణాల అతి క్రియాశీలతను తగ్గిస్తుంది. ఇది శ్లేష్మాన్ని, వాపును సహజంగా తగ్గించి, ఆస్తమా మరియు బ్రోంకైటిస్ రోగులకు ఊపిరితిత్తులలోని కండరాలను రిలాక్స్ చేయడానికి సహాయపడుతుంది. ఎలుకల పైన చేసిన పరిశోధనల ద్వారా కుప్పింటాకు ఊపిరితిత్తుల వాపును, ఆయాసం, కఫం, దగ్గును తగ్గించడంలో ఉపయోగపడుతుందని రుజువైంది. 4. మలబద్ధకం నుండి ఉపశమనం: కొంతమందికి మలద్వారం వద్ద స్పింక్టర్ బాగా బిగుతుగా ఉండటం వల్ల మోషన్ సరిగా అవ్వదు. అలాంటి వారికి కుప్పింటాకు ముద్దను తయారుచేసి, మలద్వారంలో ఉంచితే ఆ స్పింక్టర్ రిలాక్స్ అయ్యి మోషన్ ఫ్రీగా అవ్వడానికి సహాయపడుతుంది. ఇది సహజ సిద్ధమైన సపోసిటరీ వలె పనిచేసి, మలబద్ధకం ఉన్నవారికి ఉపశమనాన్ని అందిస్తుంది. 5. చెవి ఇన్ఫెక్షన్లు, చీము కారడం: చెవిలో చీము కారడం, వాపు, బ్యాక్టీరియల్ లేదా ఫంగల్ ఇన్ఫెక్షన్లు ఉన్నవారికి కుప్పింటాకు రసం ప్రయోజనకరంగా ఉంటుంది. కుప్పింటాకు రసాన్ని తీసి ఐదు, ఆరు చుక్కలు చెవిలో వేస్తే, అది యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. చెవిలో వాపును తగ్గించి, చీము కారడాన్ని నివారిస్తుంది. 2017లో మలేషియా దేశం వారు జరిపిన పరిశోధనల ద్వారా చెవిలో వాపును తగ్గించడంలో కుప్పింటాకు యొక్క ఈ ఉపయోగం నిరూపించబడింది. మనం ఇప్పటివరకు కుప్పింటాకు అందించే ఐదు రకాల లాభాలను తెలుసుకున్నాం. పూర్వం డాక్టర్లు, మందులు లేనప్పుడు మన ఋషులు ప్రకృతి ప్రసాదించిన ఔషధాలలో ఏది ఏ సమస్యకు పని చేస్తుందో గుర్తించి ఆయుర్వేద వైద్య శాస్త్రాన్ని అందించారు.

# ఐపీఎల్ 2026లో సీఎస్కేకు భారంగా మారిన ముగ్గురు ఆటగాళ్లు




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మార్చి 28వ తేదీన ఆర్సీబీ వర్సెస్ ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్ తో టోర్నమెంట్ ప్రారంభమవుతుంది. త్వరలోనే ప్రారంభమయ్యే చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఎదుర్కోబోయే సవాళ్లు, జట్టుకి ప్రతికూలంగా మారే అవకాశం కనిపిస్తుంది. ముఖ్యంగా టీమ్ లో ఉన్న ముగ్గురు ఆటగాళ్లు సీఎస్కేకు పెను భారంగా మారే ఛాన్స్ ఉంది. ఐదుసార్లు ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై, 2026 సీజన్ కోసం భారీ మార్పులతో సిద్ధమైంది. వేలంలో ప్రశాంత్ వీర్, కార్తీక్ శర్మ లాంటి యువ ఆటగాళ్లపై కోట్లు కుమ్మరించిన సీఎస్కే, డెవాల్డ్ బ్రెవిస్, జేమీ ఓవర్టన్ వంటి విదేశీ స్టార్లతో పటిష్టంగా కనిపిస్తోంది. కానీ కొంతమంది కీలక ప్లేయర్స్ ఫామ్, మరికొందరికి అనుభవం లేకపోవడం జట్టుకు తీవ్ర ఇబ్బందిగా మారనుంది.

**1. నూర్ అహ్మద్:**

ఆఫ్ఘనిస్తాన్ స్పిన్నర్ నూర్ అహ్మద్‌ను గత మెగా వేలంలో సీఎస్కే ఏకంగా 10 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. 2025 సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచినప్పటికీ, ప్రస్తుతం అతని ప్రదర్శన ఆందోళన కలిగిస్తోంది. తాజాగా భారత్‌లో జరిగిన టీ20 వరల్డ్ కప్‌లో నూర్ అహ్మద్ ధారాళంగా పరుగులు సమర్పించుకున్నాడు. బ్యాటర్లు అతని బౌలింగ్‌ను ఈజీగా రీడ్ చేయగలుగుతున్నారు. చెన్నై పిచ్‌లు స్పిన్‌కు అనుకూలించినా, నూర్ తన గత ఫామ్‌ను అందుకోకపోతే సీఎస్కే బౌలింగ్ విభాగం కష్టాల్లో పడే ఛాన్స్ ఉంది.

**2. ప్రశాంత్ వీర్:**

స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజాకు ప్రత్యామ్నాయంగా యూపీకి చెందిన 20 ఏళ్ల ప్రశాంత్ వీర్‌ను చెన్నై సూపర్ కింగ్స్ జట్టు 14.20 కోట్ల రూపాయలకు దక్కించుకుంది. జడేజా వంటి వెటరన్ ఆటగాడి స్థానాన్ని భర్తీ చేయడం ఈ యువకుడికి పెద్ద సవాలుగా మారనుంది. అనుభవం లేకపోవడంతో పాటు ఒత్తిడిలో అతని ప్రదర్శనపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం కనిపిస్తుంది. జడేజాలా పొదుపైన బౌలింగ్, మెరుపు బ్యాటింగ్‌ను ప్రశాంత్ చేస్తాడా అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నార్థకంగా మారింది.

**3. ఎంఎస్ ధోనీ:**

44 ఏళ్ల వయసులో ఎంఎస్ ధోనీ తన 19వ సీజన్ ఆడేందుకు సిద్ధమయ్యాడు. ఈసారి జట్టులో అతని పాత్రపై ఇంకా క్లారిటీ రాలేదు. జట్టులో సంజూ శాంసన్ ఉండటంతో ధోనీ వికెట్ కీపింగ్ చేయాల్సిన అవసరం లేదు. కేవలం లోయర్ ఆర్డర్ ఫినిషర్‌గా లేదా ఇంపాక్ట్ ప్లేయర్‌గా మాత్రమే అతను కనిపించే అవకాశం ఉంది. అతని అనుభవం జట్టుకు ప్లస్ అయినప్పటికీ, వయసు రీత్యా ఫిట్‌నెస్ సమస్యలు తలెత్తవచ్చు.. యువ ఆటగాళ్లతో పోటీ పడి రాణించడం ధోనీకి ఈ వయసులో సవాలుతో కూడుకున్న విషయం.

# పీఎస్ఎల్‌కు షాక్ ఇచ్చి.. ఐపీఎల్‌లోకి డాసున్ శనక ఎంట్రీ




ఇంటర్నెట్ డెస్క్: పాకిస్థాన్ సూపర్ లీగ్ నుంచి విదేశీ క్రికెటర్లు ఒక్కొక్కరు వీడుతున్నారు. అక్కడి భద్రతతోపాటు ఆర్థికపరమైన అంశాలతో బయటకొచ్చేస్తున్నట్లు సమాచారం. తాజాగా శ్రీలంక కెప్టెన్ డాసున్ శనక కూడా ఇదే నిర్ణయం తీసుకున్నాడు. దీంతో శనక ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నాడు. గత వేలంలో అతడిని ఎవరూ కొనుగోలు చేయలేదు. పీఎస్ఎల్ వేలంలో 75 లక్షల పాకిస్థాన్ రూపాయలు దక్కించుకున్నాడు. అయినా సరే ఆ లీగ్‌ను వదిలి.. రాజస్థాన్ రాయల్స్ జట్టుతో చేరే అవకాశం ఉంది."అవును.. మేం శనకతో ఒప్పందం చేసుకొనే దిశగా వెళ్తున్నాం. కొన్ని అంశాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. శ్రీలంక క్రికెట్ బోర్డుతో అతడు పేపర్ వర్క్‌ను కంప్లీట్ చేయాల్సి ఉంది. అది ముగియగానే శనకతో అగ్రిమెంట్ చేసుకుంటాం. త్వరలోనే మా జట్టుతో చేరతాడు" అని రాజస్థాన్ రాయల్స్ అధికారులు పేర్కొన్నారు. ఐపీఎల్ వేలంలో అతడు రూ. 75 లక్షల బేస్ ప్రైస్‌తో వచ్చాడు. ఇప్పుడు అతడికి ఆ మొత్తమే ఇచ్చే అవకాశం ఉంది.

**ముచ్చటగా మూడో ప్లేయర్..**

ఇప్పటికే జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్స్ ముజరబాని కూడా ఇలాగే పీఎస్ఎల్‌ను వీడి.. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుతో చేరిపోయాడు. ఇప్పుడు డాసున్ శనక రాజస్థాన్‌కు రాబోతున్నాడు. అయితే, గతేడాది దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ కార్బిన్ బాష్ పీఎస్ఎల్‌ను వదిలి.. ఐపీఎల్ మిడ్ సీజన్‌లోనే ముంబయి జట్టుతో కలిసిపోయాడు. అతడి నుంచే ఈ ట్రెండ్ ప్రారంభమైంది. ప్రస్తుతం ముగ్గురు క్రికెటర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. రాబోయే కాలంలో మరింత మంది బయటకు రావడం ఖాయమని తెలుస్తోంది.

# పంజాబ్ కింగ్స్.. ఇంకో మెట్టు ఎక్కుతుందా

## ఐపీఎల్ మరో 5 రోజుల్లో...

**18 ఏళ్ల నుంచి అలుపెరగకుండా పోరాడుతున్నా.. ప్లేఆఫ్స్ చేరింది మూడుసార్లే! అలా అని బలహీనమైన జట్టేం కాదు. ప్రతిభావంతులకు లోటేం లేదు. కానీ నిలకడ లేక.. ఏదో ఒక దశలో ఆగిపోవడం.. ఇదీ ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ కథ! వరుసగా 11 ఏళ్ల పాటు అసలు ప్లేఆఫ్స్ కూడా చేరని జట్టు.. నిరుడు శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో అనూహ్య ప్రదర్శనతో ఫైనల్‌కు చేరింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో ఓడి రన్నరప్ ట్రోఫీకి పరిమితమైన పంజాబ్.. ఈసారైనా కప్పు గెలవాలనే పట్టుదలతో ఉంది.**




2008 ఐపీఎల్ తొలి సీజన్లో టాప్–4లో నిలిచిన పంజాబ్.. ఆ తర్వాత 2014 వరకు లీగ్ దశ దాటలేకపోయింది. 2014లో తొలిసారి ఫైనల్ చేరినా.. రన్నరప్‌గా నిలిచింది. ఆ తర్వాత మళ్లీ మామూలే. నిష్క్రమణ లీగ్ దశలోనే. మళ్లీ గ్రూప్ దశ దాటడానికి దశాబ్దంపైనే పట్టింది. 2024లో శిఖర్ ధావన్‌ను సారథిగా తప్పించిన పంజాబ్.. జట్టును ప్రక్షాళన చేసింది. రూ.26.75 కోట్లతో శ్రేయస్ అయ్యర్‌ను దక్కించుకుని కెప్టెన్సీ అప్పగించింది. ట్రెవర్ బేలిస్‌ను పక్కనబెట్టి ఆసీస్ దిగ్గజం రికీ పాంటింగ్‌ను కోచ్ పదవికి ఎంపిక చేసింది. ఈ మార్పులతో మంచి ఫలితమే వచ్చింది. అదిరే ప్రదర్శనతో పంజాబ్ ఫైనల్ చేరింది. కానీ ఆఖరి మెట్టుపై బోల్తా కొట్టడంతో కప్ కల భగ్నమైంది. 2026 టోర్నీకి జట్టును కొత్తగా సిద్ధంగా చేసుకుని మరోసారి టైటిల్ కోసం ప్రయత్నించబోతోంది శ్రేయస్ సేన. గ్లెన్ మ్యాక్స్‌వెల్, జోష్ ఇంగ్లిస్, జేమీసన్‌లను వదులుకున్న ఆ జట్టు.. వేలం రూ.4.40 కోట్లు వెచ్చించి ఆస్ట్రేలియా లెఫ్ట్ ఆర్మ్ పేసర్ బెన్ డ్వార్షుయిస్‌ను, రూ.3 కోట్లతో ఆసీస్ ఆల్‌రౌండర్ కూపర్ కనోలీని జట్టులోకి తీసుకొచ్చింది. శ్రేయస్ అయ్యర్, అర్ష్‌దీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్ లాంటి టీమ్ఇండియా ప్లేయర్లకు తోడు, స్టాయినిస్, మార్కో యాన్సెన్, అజ్మతుల్లా ఒమర్‌జాయ్, ఫెర్గూసన్, బార్ట్‌లెట్, డ్వార్షుయిస్ లాంటి విదేశీ స్టార్లతో పంజాబ్ కళకళలాడుతోంది.

బలాలు: పంజాబ్‌కు ఆ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యరే ప్రధాన బలం. మ్యాచ్‌లు మలుపు తిప్పగల ఇన్నింగ్స్‌లు ఆడే శ్రేయస్.. ఇటు కెప్టెన్‌గా, అటు బ్యాటర్‌గా జట్టును ముందుండి నడిపించగలడు. బ్యాటింగ్, బౌలింగ్‌లో ఎన్నో ప్రత్యామ్నాయాలు ఉండడం పంజాబ్‌కు పెద్ద బలం. అవసరానికి తగ్గట్టు బ్యాటింగ్ ఆర్డర్‌ను మార్చుకోగల సౌలభ్యం ఆ జట్టుకు ఉంది. స్టాయినిస్, అజ్మతుల్లా, యాన్సెన్ లాంటి ప్రపంచ స్థాయి ఆల్‌రౌండర్లు ఆ జట్టు సొంతం. వీరికి తోడు చాహల్, అర్ష్‌దీప్, ఫెర్గూసన్‌ల అంతర్జాతీయ అనుభవం ఆ జట్టుకు కలిసొచ్చేదే. చాహల్ స్పిన్ బౌలింగ్ పంజాబ్‌కు పెద్ద బలం. దేశీ ప్లేయర్లు ప్రియాంశ్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్, శశాంక్ సింగ్ పంజాబ్ బలాన్ని పెంచుతున్నారు. నిరుడు ఈ ముగ్గురూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించారు. బలహీనతలు: 2025 ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో

తీవ్ర గాయం కావడంతో చాలా రోజులు శ్రేయస్ భారత జట్టుకు దూరమైపోయాడు. ఈ ఏడాది ఆరంభంలో న్యూజిలాండ్‌తో సిరీస్‌లో పునరాగమనం చేసిన అతడు పెద్దగా రాణించలేకపోయాడు. తాజాగా 7 కేజీల బరువు తగ్గి ఫిట్‌గా మారిన ఈ స్టార్ బ్యాటర్.. ఐపీఎల్‌లో ఎలా ఆడతాడో చూడాలి. శ్రేయస్‌కు గాయాల చరిత్ర ఉండడం జట్టుకు ఆందోళన కలిగించేదే. పంజాబ్‌లో ప్రతిభావంతులకు కొదవలేదు. కానీ కీలక సమయాల్లో సమష్టిగా రాణించలేకపోవడం ప్రతికూలాంశం. జట్టులో మ్యాచ్ విన్నర్లు ఉన్నా.. సరైన మేళవింపు లేకపోవడంతో వారి ప్రతిభను సరిగా సద్వినియోగం చేసుకోలేకపోతోందా జట్టు. వ్యక్తిగత కారణాలతో ఫెర్గూసన్ ఆరంభంలో కొన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉండని నేపథ్యంలో అతడి స్థానాన్ని భర్తీ చేయగల సామర్థ్యం ఉన్న బౌలర్ కనిపించట్లేదు. అర్ష్‌దీప్ ప్రతిభావంతుడే కానీ స్థిరత్వం లేకపోవడం లోపం. స్టాయినిస్ ఒకప్పటంత గొప్ప ఫామ్‌లో లేడు.

# ఫోటోషూట్ లో అషు రెడ్డి స్టన్స్



# రూట్ మార్చిన పూరీ జగన్నాథ్.. ఆ హీరోలకు లైఫ్ ఇవ్వనున్నారా?



తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఒకప్పుడు పూరీ జగన్నాథ్ అంటే ఒక బ్రాండ్. ఫ్లాపుల్లో ఉన్న హీరోలకు తన మార్క్ మ్యానరిజంతో బ్లాక్ బస్టర్ హిట్స్ ఇచ్చి వారి కెరియర్‌ను మలుపు తిప్పిన ఘనత ఆయనది. అయితే, వరుస పరాజయాలతో సతమతమవుతున్న పూరీ, ఇప్పుడు తన సెకండ్ ఇన్నింగ్స్‌లో రూట్ మార్చినట్లు కనిపిస్తోంది. టాలీవుడ్‌ను వదిలి ఇప్పుడు కోలీవుడ్ స్టార్ హీరోలపై గురిపెట్టిన పూరీ అక్కడ కూడా తన మ్యాజిక్‌ను రిపీట్ చేసి ఆ హీరోల కెరియర్‌కు కొత్త ఊపిరి పోస్తారా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఆ వివరాలలోకి వెళితే ..

**డిజాస్టర్ల తర్వాత పూరీ మార్క్ జాక్ పాట్:**

సాధారణంగా ఏ దర్శకుడికైనా రెండు భారీ డిజాస్టర్లు పడితే, టయర్ వన్ హీరోలు అపాయింట్‌మెంట్ ఇవ్వడమే కష్టం. కానీ 'లైగర్' 'డబుల్ ఇస్మార్ట్' వంటి ఫలితాల తర్వాత కూడా పూరి జగన్నాథ్ తన క్రేజ్‌ను ఏమాత్రం తగ్గించుకోలేదు. విజయ్ సేతుపతితో 'స్లమ్ డాగ్' పూర్తి చేసిన పూరీ, ఇప్పుడు కోలీవుడ్ టాప్ స్టార్ సూర్యతో ఒక మెగా ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ పొందినట్లు ఇండస్ట్రీ టాక్. ఇక ఈ అనూహ్య కలయిక గురించి ఇంకా అధికారిక ప్రకటన రానప్పటికీ, ఫిలిం నగర్ వర్గాలు మాత్రం ఈ కాంబో పక్కా అని అంటున్నాయి. తెలుగు హీరోలకు గతంలో లైఫ్ ఇచ్చినట్టే, ఇప్పుడు కోలీవుడ్ స్టార్స్‌ను కూడా పూరీ తనదైన స్టైల్లో సరికొత్తగా ప్రెజెంట్ చేయబోతున్నారట.

**స్లమ్ డాగ్‌పై భారీ ఆశలు.. సూర్యతో నెక్స్ట్ లెవల్:**

ప్రస్తుతం పూరి జగన్నాథ్ దృష్టి అంతా 'స్లమ్ డాగ్' సినిమాపైనే ఉంది. విజయ్ సేతుపతి హీరోగా, సంయుక్త మీనన్ హీరోయిన్‌గా తెరకెక్కిన ఈ యాక్షన్ డ్రామాలో టబు మరియు దునియా విజయ్ కీలక పాత్రలు పోషించారు. గతం కంటే భిన్నంగా, ఈ సినిమాను పూరి చాలా జాగ్రత్తగా రాసుకున్నారని సమాచారం. ఇక ఈ సినిమా రిజల్ట్ తర్వాతే సూర్య ప్రాజెక్టు పట్టాలెక్కే అవకాశం ఉంది. ఒకవేళ స్లమ్ డాగ్ క్లిక్ అయితే, సూర్యతో పూరి చేయబోయే సినిమా 'బిజినెస్ మేన్' రేంజ్ మాస్ ఎలివేషన్లతో ఉంటుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. తమిళ హీరోలతో వరుసగా సినిమాలు సెట్ చేసుకుంటున్న పూరి, తన సెకండ్ ఇన్నింగ్స్ మొత్తాన్ని చెన్నై బేస్డ్ గా ప్లాన్ చేస్తున్నట్లు అర్థమవుతోంది.

**పాత పూరి ఈసారి కొత్తగా వస్తారా?:**

ఇక తన కెరియర్ మొదట్లో రవితేజ, మహేష్ బాబు వంటి హీరోలకి ఇమేజ్ మార్చిన పూరి, ఇప్పుడు తన పాత తప్పులను సరిదిద్దుకుని మళ్ళీ ఫామ్ లోకి రావాలని కసితో ఉన్నారు. కోలీవుడ్ హీరోలు కూడా పూరి జగన్నాథ్ హీరో క్యారెక్టరైజేషన్లకు ఫిదా అవుతుంటారు. అందుకే సూర్య వంటి స్టార్ హీరోలు కూడా ఆయనకు అవకాశం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం సూర్య తన 'కరుప్పు' సినిమా రిలీజ్ కోసం చూస్తుండగా, వెంకీ అట్లూరి సినిమా తర్వాత పూరితో సెట్స్ పైకి వెళ్లే ఛాన్స్ ఉంది. ఈ వేసవిలో స్లమ్ డాగ్ విడుదలై పూరికి విజయాన్ని అందిస్తే, కోలీవుడ్ లో పూరి జగన్నాథ్ హవా మళ్ళీ మొదలైనట్టే.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com